


గోడకు ఆనిస్తే.. వెలుగుతున్న టెస్టర్

● ఈ ఫొటోలో ఉన్న పెద్దాయన పేరు గౌస్. కక్కలపల్లి పంచాయతీ పరిధిలోని ప్రజాశక్తి నగర్‌లో (టమోటా మార్కెట్ వద్ద) ఉంటారు. పది రోజుల క్రితం తాగునీటి మోటరుకు పైప్ అమరుస్తుండగా.. తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యారు. కోలుకునేందుకు నాలుగైదు రోజులు పట్టింది.



● ఈ ఫొటోలో ఉన్నది విద్యుదాఘాతం కారణంగా కమిలిపోయి, బొబ్బలెక్కిన చేయి. ప్రజాశక్తి నగర్‌లోని ఓ ఇంటి ప్రహరీకి పెయింటింగ్ వేయబోగా.. ఐరన్ పైపు ఆ చేతిని లాగి పట్టుకుంది. కారణం.. ప్రహరీకి విద్యుత్ సరఫరా కావడమే. ఆ ఇంటివారు సకాలంలో మెయిన్ స్విచ్ ఆఫ్ చేయడంతో ప్రాణాపాయం తప్పింది. కానీ ఆస్పత్రిపాలయ్యాడు బాధితుడు.

ఇంటింటికీ కరెంటు..!

స్విచ్ ఆఫ్ చేసినా వెలుగుతున్న లైట్లు.. తిరుగుతున్న ఫ్యాన్‌లు

బీజేపీ కొట్టాలు, ప్రజాశక్తి నగర్‌లో ప్రమాదకర పరిస్థితులు

ఇప్పటికే ఇద్దరికి తీవ్ర విద్యుదాఘాతం.. ఆస్పత్రిపాలు

విషయం తెలిసినా.. విద్యుత్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం

అనంతపురం రూరల్, మార్చి 2: మండల పరిధిలోని కక్కలపల్లి రూరల్ పంచాయతీ ప్రజాశక్తి నగర్, బీజేపీ కొట్టాలలో నివాస గృహాలకు విద్యుత్ సరఫరా అవుతోంది. గోడలు తాకినా, వస్తువులను తాకినా తీవ్ర విద్యుదాఘాతానికి గురవుతున్నారు. ఆంజనేయస్వామి ఆలయ సమీపంలోని పలు నివాస గృహాలలో గోడలకు కరెంటు వస్తోంది. టెస్టర్ పెడితే లైటు వెలుగుతోంది. గుడ్డి సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్త్ పైపును తొలగించారు. దీంతో ఫేస్, న్యూట్రల్ లైన్‌లు రెండింటిలోనూ విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ కారణంగా స్విచ్ ఆఫ్ చేసినా లైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఫ్యాన్‌లు తిరుగుతూనే ఉన్నాయి. అర్ధరాత్రిళ్లు ఉన్నట్లుండి విద్యుత్ మోటార్ల నుంచి ఆన్ అయినట్లు శబ్దాలు వస్తున్నాయి. వారం పదిరోజులుగా ఈ సమస్యను ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కాలనీలో శనివారం ఉదయం 11 గంటల సమయంలో ఉన్నఫలంగా ఇళ్లకు, ప్రహరీలకు విద్యుత్ సరఫరా అయ్యింది. వేటిని ముట్టుకున్నా షాక్ కొట్టింది. కాలనీలోని ఓ ఇంట్లో పెయింటింగ్ వేస్తున్న షేక్షావలి అనే కార్మికుడు తీవ్ర విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఐరన్ పైప్‌కు విద్యుత్ సరఫరా కావడం, దాన్ని ఆయన పట్టుకోవడంతో చేతులకు బొబ్బలు వచ్చి, నల్లగా కమిలిపోయాయి. తీవ్ర అస్వస్థతకు గురైన బాధితుడిని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించి చికిత్స చేయించారు.


ఎర్త్ పాయింట్ ధ్వంసమైనది ఇక్కడే..

విషయం తెలిసినా..

కాలనీలో విద్యుత్ ప్రమాదాలకు కారణమేమిటో ఆ శాఖ సిబ్బందికి తెలుసు. ఆంజనేయస్వామి గుడ్డి వద్ద కొన్నిరోజుల కిందట అంగన్‌వాడీ భవన నిర్మాణం కోసం పనులు చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కింద ఏర్పాటు చేసి ఎర్తింగ్ పైపును తొలగించారు. దీంతో న్యూట్రల్ లైన్‌లోనూ విద్యుత్ సరఫరా అవుతోంది. ఈ కారణంగా గోడలు, వస్తువులు ముట్టుకుంటే షాక్ కొడుతోంది. ఎర్తింగ్ వైర్‌కు తేమ తగలకపోవడంతో ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని విద్యుత్ శాఖ సిబ్బందే చెబుతున్నారు. దీనికితోడు ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యానికి మించి కనెక్షన్లు ఉన్నాయి. ఆ కాలనీల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. గోడలకు కరెంటు సరఫరా అవుతోందని స్థానికులు విద్యుత్ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. అయినా వారు స్పందించడం లేదని వాపోతున్నారు. పెయింటర్ ప్రమాదానికి గురైన విషయం తెలుసుకున్న ఏఈ సోమశేఖర్.. తమ లైన్‌మెన్‌ను అక్కడికి పంపించారు. ఎర్తింగ్ పైప్‌కు నీరుపోసి, సమస్యను పరిష్కరించామని అన్నారు. కానీ సమస్య అలాగే ఉందని, కావాలంటే చూడండి అంటూ.. శనివారం సాయంత్రం గోడలకు, పైప్‌లకు టెస్టర్ పెట్టి మరీ చూపించారు స్థానికులు. టెస్టర్ దేదీప్యమానంగా వెలుగుతోంది. నిర్లక్ష్యం కొనసాగుతోంది.

వివాదాల వర్సిటీ

పాలకమండలి నిర్ణయాలపై
విద్యార్థి సంఘాల ఆగ్రహం

ఎస్కేయూ పరిపాలనా భవనం ముట్టడి.. వీసీ, రిజిస్ట్రార్‌పై ఆగ్రహం

మునుపటి వీసీ అక్రమాలకు వంతపాడుతున్నారని ఆరోపణ

రేపటి నుంచి హాస్టల్, బోధనేతర సిబ్బంది సమ్మెబాట

అనంతపురం సెంట్రల్

ఉన్నత విద్యను మెరుగుపరచాల్సిన వర్సిటీ.. వివాదాలకు నిలయంగా మారుతోంది. వర్సిటీలోని కొందరు ఉన్నతాధికారుల తీరుపై నిత్యం ఏవో విమర్శలు వస్తూనే ఉన్నాయి. తాజాగా శనివారం నిర్వహించిన పాలక మండలి సమావేశంపై విద్యార్థి సంఘాలు భగ్గుమన్నాయి. ఎస్కేయూ యాజమాన్యం అక్రమాలకు మద్దతు పలుకుతోందని ఆరోపించారు. పాలక మండలి(ఈసీ) సమావేశాన్ని వేదికగా చేసుకుని, అక్రమార్కులకు ఉద్యోగోన్నతి, ఆర్థిక ప్రయోజనాలు చేకూర్చేందుకు ఆమోద ముద్ర వేశారని వర్సిటీ వర్గాలు మండిపడుతున్నాయి. పారదర్శకంగా పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బందికి అర్హత ఆధారంగా కల్పించాల్సిన హక్కులను కాలరాస్తున్నారని బాధితులు ఆరోపించారు. పాలక మండలి నిర్ణయాలను వ్యతిరేకిస్తూ వర్సిటీ పరిపాలనా భవనాన్ని విద్యార్థి సంఘాలు ముట్టడించాయి. వారిని పోలీసులు అడ్డుకున్నారు.

గ్రంథాలయ జూనియర్ అసిస్టెంట్ చేత మునుపటి వీసీ రామకృష్ణారెడ్డి ఇంటి పనులు చేయించుకుని, కేంద్ర గ్రంథాలయానికి ఇన్‌చార్జిగా నియమించారని ఆరోపించారు. అక్కడితో ఆగకుండా అసిస్టెంట్ గ్రేడ్-1 ప్రమోషన్ ఇచ్చివెళ్లిపోయయారని మండిపడ్డారు. ఈ ప్రమోషన్‌కు ప్రస్తుత వీసీ హుస్సేన్ రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్య ఈసీలో ఎలా ఆమోదముద్ర వేయిస్తారని ప్రశ్నించారు. సోషియాలజీ, ఆర్‌డీ వంటి విభాగాల్లో తన అనుచరులను అకడమిక్ కన్సల్టెంట్‌లుగా అడ్డదారుల్లో నియమించారని ఆరోపించారు. రూ.కోట్లు దండుకుని 10, 12 ప్లాన్ టీచింగ్ ఫ్యాకల్టీకి ప్రమోషన్ కల్పించారని అన్నారు. వర్సిటీకి చెందిన ఐదు ఎకరాల స్థలాన్ని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అప్పనంగా కట్టబెట్టేందుకు ప్రయత్నించి విఫలమయ్యారని అన్నారు.

దోచిపెట్టేందుకే...

టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి పనులకు కేటాయించిన నిధులను, నూతన భవనాల నిర్మాణం పేరిట కాంట్రాక్టర్ హనుమంతరెడ్డికి దోచిపెట్టారని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన అధికారులను, సిబ్బందిని మానసికంగా వేధించిన రామకృష్ణారెడ్డి అరాచక పర్వాన్ని ప్రస్తుత వర్సిటీ యాజమాన్యం కొనసాగిస్తోందని విమర్శించారు. ఆయన అక్రమాలను చక్కబెట్టేందుకు రిజిస్ట్రార్ లక్ష్మయ్య కుయుక్తులుపన్నుతున్నారని, విద్యార్థుల సొమ్మును దోచిపెట్టేందుకు సిద్ధమయ్యారని మండిపడ్డారు. అరకొర జీతాలతో వందలాది మంది ఏళ్ల తరబడి పనిచేస్తున్నారని, వారిని రెగ్యులర్ చేయడానికి వర్సిటీ యమాజమాన్యానికి చేతులు రావడం లేదని విమర్శించారు. వినతి పత్రాన్ని ఇచ్చేందుకు వచ్చిన తమను పోలీసుల చేత నిలువరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్సిటీలో శనివారం నిర్వహించిన ఈసీ సమావేశంలో అక్రమంగా ఆమోదం పొందిన అంశాల గురించి గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అంబేడ్కర్ విగ్రహానికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజునాయక్, మంజునాథ్, వంశీకృష్ణ, ఉమామహేష్, భీమేష్, శివ, వంశీ, పవన్, ఆనంద్, ప్రసన్న, అనీల్, యామన్న పాల్గొన్నారు.

అన్నీ అక్రమాలే..

పాలక మండలి నిర్ణయాలపై ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కుళ్లాయిస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమణయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేపటి నుంచి సమ్మె..

హాస్టల్, బోధనేతర ఉద్యోగులు సోమవారం నుంచి సమ్మెల్లోకి వెళుతున్నారు. ఈ మేరకు వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ లక్ష్మయ్యకు శనివారం సమ్మె నోటీసును అందజేశారు. దశాబ్దాలుగా విద్యార్థులకు, వర్సిటీకి సేవలందిస్తున్న తమకు టైంస్కేల్ వర్తింపచేజేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మృతిచెందిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం ఇవ్వడంలేదని అన్నారు. బాధిత కుటుంబాలకు నిబంధనలకు మేరకు చెల్లించాల్సిన పరిహారాన్ని ఇవ్వకుండా వేధిస్తున్నారని అన్నారు. ఇలా అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లానా ఈసీ అజెండాలో పెట్టడంలేదని మండిపడ్డారు. అందుకు నిరసనగా సోమవారం నుంచి సమ్మెకు వెళుతున్నామని తెలిపారు.


అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పిస్తున్న విద్యార్థి నాయకులు



నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు


మాట్లాడుతున్న మాజీ మంత్రి పరిటాల సునీత

ఢిల్లీలో చెల్లి కన్నీరు పెడుతోంది

ఏం సమాధానం చెబుతావు జగన్?... మాజీ మంత్రి పరిటాల సునీత

అనంతపురం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): 'దేశ రాజధాని ఢిల్లీలో మీ చెల్లెలు కన్నీరు పెడుతోంది. తన తండ్రిని చంపిన వారిని ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నిస్తోంది. దీనికి ఏం సమాధానం చెబుతారు..?' అని సీఎం జగన్‌ను మాజీ మంత్రి పరిటాల సునీత ప్రశ్నించారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. వైఎస్ సునీత రెడ్డి మాటలు చూసిన తరువాత తనకు చాలా బాధ కలిగిందని అన్నారు. ఒక ఆడబిడ్డ చేస్తున్న న్యాయ పోరాటానికి రాష్ట్రం మొత్తం అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. సొంత బాబాయిని చంపినవారిని జగన్ కాపాడే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ లబ్ధి కోసం వైఎస్ వివేకానందరెడ్డిని జగన్ ముఠానే హతమార్చిందన్న అనుమానాలు కలుగుతున్నాయని ఆమె అన్నారు. గొడ్డలి పోటుతోనే బాబాయ్ చనిపోయారని జగన్‌రెడ్డి అంత ఖచ్చితంగా ఎలా చెప్పారని ప్రశ్నించారు. హై ప్రొఫైల్ కేసులో ఇంత జాప్యానికి జగన్ రెడ్డి కారణమని సునీత చెప్పారంటే.. జగన్ పాత్రపై అందరికీ సందేహాలు కలుగుతున్నాయని అన్నారు. 'మీరు ఎలాంటి తప్పు చేయకపోతే.. కర్నూలులో అవినాష్‌ను అరెస్టు చేయడానికి ప్రయత్నించిన సమయంలో ఉద్రిక్త వాతావరణాన్ని సృష్టించాల్సిన అవసరం ఏముందని ఆమె ప్రశ్నించారు. ఆడబిడ్డకు న్యాయం చేయలేని సీఎం, రాష్ట్రంలో ఉన్న అక్క చెల్లెమ్మలకు ఏం న్యాయం చేస్తారని నిలదీశారు. వివేకానందరెడ్డి హత్య కేసులో జగన్ పాత్రపై విచారణ జరపాలని ఆమె డిమాండ్ చేశారు.

రా.. కదలిరాకు తరలిరండి

పెనుకొండలో ఈ నెల 4న నిర్వహించే 'రా.. కదలిరా..' బహిరంగ సభకు భారీగా తరలిరావాలని పార్టీ శ్రేణులకు పరిటాల సునీత పిలుపునిచ్చారు. ఎన్నికల సందర్భంగా టీడీపీ అధినేత చంద్రబాబు చేపట్టిన పర్యటనలకు జనం భారీ స్థాయిలో తరలివస్తున్నారని అన్నారు. కియ సమీపంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ ఉంటుందని తెలిపారు. జిల్లా సమస్యల పరిష్కారం, అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే కార్యాక్రమాల గురించి ఈ సభలో చంద్రబాబు వివరిస్తారని ఆమె తెలిపారు. సమావేశంలో నాయకులు రంగయ్య కొండప్ప, సుధాకర్, నెట్టెం వెంకటేష్, రామమూర్తి, శ్రీనివాసులు, పరందామ యాదవ్ పాల్గొన్నారు.

ఎంటీ.. ఆయన కథేంటి..?

మోటార్ ట్రాన్స్‌పోర్ట్‌లో వసూల్ రాజా

వాహనాల డీజిల్, పెట్రోల్ పక్కదారి

హైవే డ్యూటీలు వేసేందుకు ముడుపులు

అనంతపురం క్రైం, మార్చి 2: పోలీసు శాఖ జిల్లా హెడ్‌క్వార్టర్స్ పరిధిలో ఉండే కీలక విభాగాల్లో ఒకటి మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగం. ఎంటీ అని ఈ విభాగాన్ని పిలుస్తుంటారు. జిల్లాలో పోలీస్‌స్టేషన్ల నుంచి హైవే చెకింగ్‌కు వెళ్లేందుకు వాహనాలను సమకూర్చే బాధ్యత ఈ విభాగానిదే. ఆ వాహనాలకు డీజిల్, పెట్రోలును పోలీస్ శాఖ పెట్రోల్ బంకుల నుంచే ఇస్తారు. ఇంతటి కీలకమైన విభాగంలో ఉండే ఓ సారు వసూల్ రాజాగా మారినట్లు ప్రచారం జరుగుతోంది. డీజిల్, పెట్రోల్‌ను పక్కదారి పట్టిస్తారని, ఉన్నతాధికారులకు తెలియకుండా భారీగా అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలే ఆయన వ్యవహారాలు బయటపడినట్లు సమాచారం.

డీజిల్ లాగేయడంలో దిట్ట

ఎంటీ విభాగానికి పోలీస్ స్టేషన్లలో బ్లూకోల్ట్స్ సిబ్బంది ఉపయోగించే బైక్‌లతో పాటు సీఐ స్థాయి అధికారులు వాడే బొలెరో వాహనాలు వస్తాయి. ఇవి కాకుండా, అదనంగా వాహనాలు అవసరమైనా.. ఈ విభాగమే సమకూరుస్తుంది. ఈ విభాగానికి ఉన్నతాధికారిగా రిజర్వ్ ఇన్‌స్పెక్టర్(ఆర్ఐ) ఉంటారు. మెకానిక్ అని పిలిచే ఓ స్థాయి అధికారి ప్రస్తుతం ఈ విభాగం నిర్వహణ చూస్తున్నారు. పై అధికారి చెప్పిన వారికి వాహనాలు సమకూర్చే బాధ్యత ఈయనదే. ఇదే అదనుగా, అంతా తానైనట్లు చక్రం తిప్పుతున్నారు ఈ సారు. ఏఎస్ఐకి తక్కువ కానిస్టేబుల్‌కు ఎక్కువ కేడర్‌లో ఉంటే ఈయన, డీజిల్ తీయించడంలో దిట్ట అని పేరు గడించారు. అనంతపురం పరిధిలోని వాహనాలన్నింటికీ కోర్టు రోడ్డులోని పోలీస్ పెట్రోల్ బంకు నుంచే డీజిల్, పెట్రోలు పోయిస్తారు. కొన్ని వాహనాలు పెద్దగా తిరగకపోయినా, అసలే తిరగకపోయినా పెట్రోల్, డీజిల్ పోయిస్తుంటారనే ఆరోపణలున్నాయి. అంతా ఆయన చేతిలోనే ఉండటంతో ఈ సారు అందులో కొంత డీజిల్, పెట్రోలు లెక్కలు మారుస్తుంటారని సమాచారం. ఇలా ప్రతి నెలా పెద్ద మొత్తంలో డీజిల్, పెట్రోల్‌ను ఆయన తాగేస్తున్నారని, దొంగ లెక్కలు సృష్టిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై కొంతకాలంగా ఎంటీ విభాగంలో చర్చ నడుస్తోంది.



పైసలిచ్చిన వారికే డ్యూటీ...

మోటార్ ట్రాన్స్‌పోర్ట్ విభాగానికి డ్యూటీలు వేసే అధికారం ఉంటుంది. సీఐలు, డీఎస్పీల వాహనాలకు, పోలీస్‌స్టేషన్లకు, అత్యవసర సందర్భాల్లో వాహనాలకు ఈ విభాగం నుంచి డ్రైవర్లను పంపుతుంటారు. ఇందులో ఏఆర్ సిబ్బంది, హోంగార్డులే ఉంటారు. హైవే తనిఖీలకు వెళ్లే వాహనాలకు బాగా ఆదాయం ఉంటుందనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో కొందరు ఆ విధులకు వెళ్లేందుకు ఆసక్తి చూపుతంటారు. అందుకే.. హైవేలకు డ్యూటీ వేయాలంటే ఆ సార్‌కు కొంత ముట్టజెప్పాల్సిందేనని అంటున్నారు. సార్‌కు కొన్ని వ్యక్తిగత పనులు సైతం చేయాల్సిందేనట. ఆయన హోంగార్డులతోనే వ్యవహారం నడుపుతుంటారని ఆరోపణలు ఉన్నాయి.

హంతకులకు చట్టసభల్లో చోటివ్వకండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్


మాట్లాడుతున్న జాఫర్

అనంతపురం విద్య, మార్చి 2: వైఎస్ వివేకాను హత్యచేసినవారికి చట్టసభల్లో చోటివ్వకుండా ప్రజలు చూడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ కోరారు. వివేకా హంతకులను ఐదేళ్లుగా ఈ ప్రభుత్వం పట్టుకోలేకపోవడం సిగ్గుచేటని అన్నారు. ఈ విషయంపై సీఎం జగన్ సంజాయిషీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వివేకా కుమార్తె సునీతకు అన్ని రాజకీయ పార్టీలు మద్దతుగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. సీపీఐ ఆమెకు సంపూర్ణ మద్దతు ఇస్తోందని అన్నారు. ఆ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరిని కర్నూలులో అరెస్టు చేయడానికి సీబీఐ వస్తే... స్థానిక పోలీసులు అప్పట్లో సహకరించలేదని ఆరోపించారు. దీంతో రెండు రోజులు వేచిచూసి, సీబీఐ అధికారులు వెనక్కు వెళ్లారని అన్నారు. వివేకా హత్య కేసులో నిందితులను అరెస్టు చేయలేకపోతే రాష్ట్రంలో ఉన్న 5 కోట్ల మందికి ప్రజలకు ఏ రకంగా న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఎస్కే యూనివర్సిటీ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పాలని చూడటం సరికాదని అన్నారు. పాలకమండలిలో తీర్మానం చేసి, 5 ఎకరాల భూమిని అప్పజెప్పే ప్రయత్నాలను వెంటనే విరమించాలని సూచించారు. సమావేశంలో ఆ పార్టీ నాయకులు నారాయణస్వామి, రాజారెడ్డి, లింగమయ్య, శ్రీరాములు పాల్గొన్నారు.

మెజార్టీ 50 వేలకు తగ్గదు

టీడీపీ రాయదుర్గం అభ్యర్థి కాలవ

డి హీరేహాళ్, మార్చి 2: రాయదుర్గం నియోజకవర్గంలో తాను 50 వేల పైచిలుకు మెజార్టీతో గెలవబోతున్నానని టీడీపీ అభ్యర్థి, మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు ధీమా వ్యక్తం చేశారు. పదేళ్లకు సరిపడా అభివృద్ధి ప్రణాళికను త్వరలోనే విడుదల చేస్తానని ఆయన అన్నారు. డి.హీరేహాళ్ మండలంలోని మురడి ఆలయంలో శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. ఆంజనేయస్వామి దివ్యాశీస్సులతో, వాల్మీకి మహర్షి వాత్సల్య పూరిత ఆశీస్సులు, కురుబల తొలి ఆశీస్సులతో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నామని అన్నారు. 2024-29 మధ్య కాలంలో భైరవాన్‌తిప్ప ప్రాజెక్టును కృష్ణా జలాలతో కళకళలాడే విధంగా చేస్తానని అన్నారు. తుంగభద్ర ఎగువ కాలువ ఆధునికీకరణ పనులను ప్రారంభిస్తామని, 2034 లోపు ప్రాజెక్టును పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగు నీరు అందించే బృహత్తర కార్యక్రమాన్ని 2024-29 మధ్యకాలంలో 80 శాతం పూర్తి చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. ఆవులదట్ల, మాల్యం బ్రాంచ్ కాలువల పనులన్నీ చంద్రబాబు ఆశీర్వాదంతో పూర్తి చేయడానికి బలంగా కృషి చేస్తానని అన్నారు. గుమ్మఘట్ట మండలంలో గోనబావిలో అర్ధంతరంగా ఆగిపోయిన బాలికల బీసీ ఆశ్రమ పాఠశాల భవనాలను పూర్తి చేస్తానని అన్నారు. డి.హీరేహాళ్‌లో బాలికల ఆశ్రమ పాఠశాలకు సొంత భవనాన్ని నిర్మిస్తానని తెలిపారు. ఈ మండలంలో స్టీల్ పరిశ్రమను ఏర్పాటు చేయడానికి ప్రత్యేక జోన్‌ను రూపొందిస్తామని అన్నారు. అత్యంత వెనుకబడిన గుమ్మఘట్ట మండలాన్ని పచ్చని పైర్లతో కళకళలాడే విధంగా చేస్తానని అన్నారు. రాయదుర్గం రూరల్ మండలంలో ఆవులదట్ల బ్రాంచ్ కెనాల్ ద్వారా గ్రామాలన్నీ సస్యశ్యామలమవుతాయని అన్నారు. మాల్యం బ్రాంచ్ కెనాల్ ద్వారా కణేకల్లు మండలంలో అదనపు ఆయకట్టు సాగులోకి వస్తుందని అన్నారు. రాయదుర్గంలో గార్మెంట్స్ రంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు హనుమంతరెడ్డి, కురుబ హనుమంతు, బలరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు నాగళ్లి రాజు, ఎంపీటీసీ గంగాధర పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్న మాజీ మంత్రి కాలవ

నీకు షేవింగ్ అవసరమా..?


సగం షేవింగ్‌తో ఉన్న వెంకటరమణ

కళ్యాణదుర్గం మండల పరిధిలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన వెంకటరమణ గెడ్డం గీయించుకుంటుండగా.. ఆ గ్రామ వలంటీరు భాస్కర్, ఆయన తండ్రి శ్రీరాములు అడ్డుకున్నారు. 'నీకు షేవింగ్ అవసరమా..?' అంటూ చొక్కా పట్టుకుని సెలూన్ షాప్ నుంచి శనివారం బయటకు లాగారని బాధితుడు ఆరోపించాడు. కాంగ్రెస్ కార్యకర్తకు షేవింగ్ అవసరమా అని తనను అవమానించారని వాపోయాడు. సగం గీకిన గెడ్డంతోనే బాధితుడు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశాడు. వైసీపీ నాయకులు, వలంటీర్ల అరాచకం రోజు రోజుకూ పెరిగిపోతోందని పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాంభూపాల్ రెడ్డి మండిపడ్డారు. తమ పార్టీ కార్యకర్త గెడ్డం గీయించుకున్నా అధికార పార్టీవారు ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- కళ్యాణదుర్గం రూరల్

నేడు పల్స్‌పోలియో

7లో...

అమిలినేనికి అపూర్వ ఆదరణ

మండలాల నుంచి తరలివస్తున్న జనం

కళ్యాణదుర్గం, మార్చి 2

టీడీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబుకు జనం నుంచి భారీగా మద్దతు లభిస్తోంది. పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదికకు వివిధ మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు శనివారం విశేషంగా తరలివచ్చారు. సురేంద్రబాబుకు మద్దతు తెలిపారు. కళ్యాణదుర్గంలో టీడీపీ విజయం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. శెట్టూరు, కుందుర్పి తదితర మండలాల నాయకులతోపాటు కళ్యాణదుర్గం పట్టణ, మండల నాయకులు సురేంద్రబాబును శనివారం కలిశారు. ఎంకొత్తూరు గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి అభినందించారు. శెట్టూరు మండలం బొచ్చుపల్లి నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలిపారు. కుందుర్పి మండలం నుంచి ముస్లిం మైనార్టీ నాయకులు వచ్చి సురేంద్రబాబును సత్కరించారు. బెంగళూరు టీడీపీ ఫోరమ్ సభ్యులు రాజు, కేటీ చౌదరి, వెంకటేష్, అనిల్, శ్రీకాంత్, హరికృష్ణ, బాలచంద్ర, వినోద్, పృథ్వీ, వేణు, చందు, తిమ్మప్ప, నవీన్, విజయ్ నారాయణ, చంద్ర, ప్రతాప్, వన్నూరుస్వామి తదితరులు ప్రజావేదికలో అమిలినేనిని కలిసి మద్దతు తెలిపారు. పాస్టర్ అరుణకుమారి అమిలినేనిను కలిసి టీడీపీ విజయానికి కృషి చేస్తామని మద్దతు తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు, నాయకులు, కార్యకర్తలతో ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రజావేదిక రద్దీగా కనిపించింది.


ప్రజావేదికలో అమిలినేని సురేంద్రబాబును కలిసిన బెంగళూరు టీడీపీ ఫోరం సభ్యులు

బాలింత మృతి

● మృతదేహంతో కుటుంబసభ్యులు, బంధువుల ధర్నా



ధర్నా చేస్తున్న మృతురాలి కుటుంబసభ్యులు



సుమలత (ఫైల్)



ఆరోగ్యంగా ఉన్న శిశువు

తాడిపత్రిటౌన్, మార్చి 2: పట్టణం లోని యల్లనూరురోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం వికటించి బాలింత సుమలత (30) శని వారం మృతి చెందినట్లు పోలీసు లు తెలిపారు. వారు తెలిపిన మేరకు పుట్లూరు మండలం కోమటి కుంట్ల గ్రామానికి చెందిన బాలగం గయ్య, సుమలత దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవించేవారు. వీరికి రెండేళ్ల కిందట మొదటి కాన్పులో కుమారుడు జన్మించాడు. మరోసారి గర్భం దాల్చిన సుమలత వైద్యపరీక్షలను ప్రైవేట్ ఆసుపత్రిలో చేయించుకునేది. వైద్యులు మార్చి18కి డెలివరీ డేట్ ఇచ్చారు. ఫిబ్రవరి 7న నొప్పులు రావడంతో భర్త, బంధువులు కలిసి సుమలతను ఆసుపత్రికి తీసుకువచ్చారు. పరీక్షిం చిన వైద్యులు వెంటనే సిజేరియన్ చేయాలని లేకపోతే ప్రాణాలకు ముప్పు ఉంటుందని తెలిపారు. ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆపరేషన్‌కు ఒప్పుకున్నారు. ఆపరేషన్ చేయడంతో సుమలత పాపకు జన్మనిచ్చింది. శిశువు ఆరోగ్యంగానే ఉన్నా తల్లి ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో అనంతపురం తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు. వెంటనే కుటుంబ సభ్యులు అనంతపురం తీసుకు వెళ్లారు. అక్కడి నుంచి బెంగళూరులో కొన్ని రోజులు, అక్కడి నుంచి తిరుపతిలో కొన్ని రోజులు చికిత్స తీసుకున్నారు. చివరగా కడపకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సుమలత శనివారం ఉదయం మృతి చెందింది. భర్తతో పాటు కుటుంబసభ్యులు, బంధువులు మృతదేహాన్ని తీసుకొని నేరుగా యల్లనూరురోడ్డులో ఉన్న ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ధర్నాకు దిగారు. డీఎస్పీ గంగయ్య, సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ షేక్‌గౌస్‌బాషా సిబ్బందితో కలిసి ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం ఆసుపత్రి యాజమాన్యం, మృతురాలి కుటుంబసభ్యులతో మాట్లాడారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

చెన్నై బీచ్‌లో ఇద్దరు విద్యార్థుల గల్లంతు



పెద్దిరాజు



శేషారెడ్డి

● విహార యాత్రకు వెళ్లిన పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్ విద్యార్థులు
● అలల తాకిడికి కొట్టుకుపోయిన ఎనిమిది మంది
● ఆరుగురిని రక్షించిన రెస్క్యూ టీం
● ఇద్దరి జాడ తెలియక తల్లిదండ్రుల్లో ఆందోళన



శనివారం ఉదయం చెన్నై బీచ్‌లో విద్యార్థులు దిగిన గ్రూప్‌ఫొటో సర్కిల్‌లో అలలకు కొట్టుకుపోయిన పెద్దిరాజు, శేషారెడ్డి



ప్రిన్సిపాల్‌తో వివరాలు ఆరాతీస్తున్న పోలీసులు

యాడికి, మార్చి 2: విహార యాత్రకు వెళ్లిన ఇద్దరు జిల్లా విద్యార్థులు చెన్నై బీచ్‌లో శనివారం గల్లంతయ్యారు. అనంతపురం జిల్లా యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద ఉన్న పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్ విద్యార్థులు పెద్దిరాజు, శేషారెడ్డి సముద్రపు అలల తాకిడికి కొట్టుకుపోయారు. వారిజాడ కోసం రెస్క్యూటీం గాలింపు చర్యలు చేపట్టినట్లు కళాశాల సిబ్బంది తెలిపారు. యాడికి మండలం బోయరెడ్డిపల్లి వద్ద పెన్నా సిమెంట్ ఫ్యాక్టరీ ఉంది. ఫ్యాక్టరీ ఆవరణలో యాజమాన్యం పెన్నా కాలేజ్ ఆఫ్ సిమెంట్ సైన్సెస్ పేరిట కాలేజీ నిర్వహిస్తోంది. ఇక్కడ విద్యార్థులు సిమెంట్ సైన్స్‌లో డిప్లొమో అభ్యసిస్తున్నారు. యాడికి మండలం కుందన కోట గ్రామానికి చెందిన పెద్దిరాజు, పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల గ్రామానికి చెందిన శేషారెడ్డి సహా 26 మంది విద్యార్థులు ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. ఏప్రిల్ నెలాఖరుకు వారి కోర్సు పూర్తి అవుతుంది. ఈ నేపథ్యంలో తొమ్మిది రోజుల విహార యాత్ర నిమిత్తం శుక్రవారం రాత్రి 8 గంటల సమయంలో కళాశాల నుంచి బయలుదేరారు. విద్యార్థుల్లో నలుగురు మినహా 22 మంది, సిబ్బంది మరో నలుగురు విహారయాత్రకు వెళ్లారు. వీరు శనివారం ఉదయం చెన్నై బీచ్‌కు చేరుకున్నారు. అందరూ కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కళాశాలలో ఉన్న అధ్యాపక బృందానికి ఆ ఫొటో పంపి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఆ తరువాత ఈతకు వెళ్లి.. ఎనిమిది మంది విద్యార్థులు అలల తాకిడికి కొట్టుకుపోయారు. వీరిలో ఆరుగురిని రెస్క్యూటీం కాపాడింది. పెద్దిరాజు (21), శేషారెడ్డి (21) నీటిలో గల్లంతయ్యారు. వారి కోసం గాలింపు కొనసాగుతోంది. సమాచారం తెలుసుకున్న పెద్దిరాజు తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు కళాశాల వద్దకు వచ్చి ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్, సిబ్బందితో తీవ్రస్థాయిలో వాగ్వాదం చేశారు. కళాశాల ఆవరణలో కుర్చీలను ధ్వంసం చేశారు. పోలీసులు వారికి సర్దిచెప్పారు. ఇద్దరు గల్లంతయ్యారని తెలియగానే కాలేజీలో ఉన్న విద్యార్థులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. అక్కడున్నవారికి ఫోన్ చేసి సమాచారం తెలుసుకుంటూ.. తమ మిత్రులు క్షేమంగా బయటపడాలని ఆకాంక్షించారు.

కూలీల బిడ్డ పెద్దిరాజు

యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దయ్య, లక్ష్మీదేవి దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. కుమారుడు పెద్దిరాజు పెన్నాసిమెంట్ సైన్సెస్ కాలేజీలో చదువుతున్నాడు. విహారయాత్రకు వెళతానని చెప్పడంతో తమ వద్ద డబ్బులు లేకపోయినా, అప్పు చేసి రూ.15 వేలు ఇచ్చి పంపామని తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. తాము వద్దని చెప్పామని, కచ్చితంగా రావాల్సిందేనని కాలేజీలో అంటున్నారనడంతో పంపించామని వాపోయారు. చేతికి వచ్చిన కొడుకు జాడ తెలియకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రైతు బిడ్డ శేషారెడ్డి

పెద్దవడుగూరు మండలం అప్పేచర్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, నారాయణమ్మ దంపతులకు ఇద్దరు కూ తుళ్లు కాగా, ఒక్కగానొక్క కుమారుడు శేషారెడ్డి. వీరిది వ్యవసాయ కుటుంబం. విషయం తెలియగానే వారు బంధువులతో కలిసి చెన్నైకి వెళ్లారు.

ఇంటర్ సెకండ్ ఇయర్ విద్యార్థి డీబార్

● 2వ రోజు 418 మంది గైర్హాజరు

అనంతపురం విద్య, మార్చి 2: ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఓ విద్యార్థిని అధికారులు డీ బార్ చేశారు. శనివారం అనంతపురం నగరంలోని న్యూటౌన్ జూనియర్ కాలేజీలో సెకండ్ లాంగ్వేజ్ పరీక్షలు రాస్తూ మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థిని అధికారులు డీబార్ చేశారు. రెండోరోజు జిల్లావ్యాప్తంగా జనరల్ విద్యార్థులు 16,478 మందికిగాను 16,097 మంది హాజరు కాగా 381 మంది గైర్హాజరయ్యారు. అదేవిధంగా ఒకేషనల్ విద్యార్థులు 1193 మందికిగాను 1156 మంది హాజరుకాగా 37 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కన్వీనర్ మూడు కేంద్రాలను, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు 4 కేంద్రాలను, ఫ్లైయింగ్‌స్క్వాడ్ 8 కేంద్రాలను, సిట్టింగ్‌స్క్వాడ్ 2 కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఈసీ కన్వీనర్ వెంకటరమణ నాయక్ పేర్కొన్నారు.

రేపు విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లకు నియామకపు ఉత్తర్వులు

అనంతపురం అర్బన్, మార్చి 2 : ఉమ్మడి అనంత జిల్లాలో 439 మంది వెటర్నరీ అసిస్టెంట్లకు నియామక ఉత్తర్వులు ఇవ్వనున్నారు. సోమవారం కలెక్టర్ చేతుల మీదుగా ఉత్తర్వులు అందజేయడంతో పాటు స్థానాలు కేటాయించనున్నట్లు ఇవ్వనున్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం శనివారం ప్రకటించారు.

రాష్ట్రస్థాయికి రెండు ప్రాజెక్టులు

అనంతపురం విద్య, మార్చి 2 : రాష్ట్ర స్థాయి ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఈఎండీపీ) ప్రదర్శనకు జిల్లా నుంచి రెండు ప్రాజెక్టులు ఎంపికైనట్లు డీఈఓ వరలక్ష్మి, జిల్లా సైన్స్ ఆఫీసర్ బాలమురళి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాల్లో చదివే 9వ తరగతి విద్యార్థుల్లో వ్యాపార మెలకువలు, ఉత్పాదక శక్తిని పెంచడానికి స్కూళ్లలో ఈఎండీపీ కార్యక్రమం నిర్వహించారు. 73 స్కూళ్ల నుంచి 100 ప్రాజెక్టులు నమోదు కాగా...వాటిలో 10 ప్రాజెక్టులను శనివారం సైన్స్ సెంటర్‌లో ప్రదర్శించారు. వీటిలో రెండు ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఎంజేపీ బీసీ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు గ్లోరీ, చందన, శ్రుతి, గైడ్ టీచర్ హిమబిందు తయారుచేసిన స్వచ్ఛ భారత్ బ్యాగుల ప్రాజెక్టు జిల్లాలో మొదటి బహుమతికి, నార్పల ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సాయి చరణ్, రేవంత్, గైడ్ టీచర్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో తయారు చేసిన అనిమల్ అలర్ట్ అలారం ప్రాజెక్టు రెండో బహుమతికి ఎంపికైంది. డీఈఓ, సైన్స్ ఆఫీసర్ ఆయా విద్యార్థులను అభినందించారు. ఈ రెండింటిని ఈనెల 6న విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రదర్శిస్తారని తెలిపారు.

ఎన్నికల సిబ్బంది నియామకం

అనంతపురం టౌన్, మార్చి 2 నియోజకవర్గస్థాయిలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేశారు. నియోజవర్గాల్లో సిబ్బందికి ఎన్నికల విధులపై అవగాహన లేనందున అనుభవం ఉన్నవారిని ఇవ్వాలని ఆర్‌ఓలు కలెక్టరును కోరారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చురుగ్గా పనిచేసే 30 మందిని ఆర్డీఓలు ఎంపిక చేశారు. ఎంపిక చేసిన జాబితాకు శనివారం కలెక్టర్ ఆమోదముద్ర వేశారు. 8నియోజకవర్గాలకు కలిపి 23 మంది, కలెక్టరేట్లో పని చేయడానికి మరో ఏడుమందిని నియమించారు. డీటీలు, సీనియర్ అసిస్టెంట్లు, ఈడీటీలు ఉన్నారు.

వేరుశనగ విక్రయాలకు పేర్లు నమోదు చేసుకోండి

అనంతపురం అర్బన్, మార్చి 2: జిల్లాలో 2023-24 రబీ సీజన్‌లో పండించిన వేరుశనగను విక్రయించేందుకు రైతులు ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకోవాలని ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి ప్రకటించారు. క్వింటా వేరుశనగ రూ. 6,377గా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎన్నాళ్లీ.. ఎదురు చూపు..!



● రెండో తేదీ ముగిసినా జీతాలు నిల్... ● సగం మంది ఉద్యోగులకు కూడా అందలేదు.. ● పెన్షనర్లదీ అదే పరిస్థితి ● ఈఎంఐలు చెల్లించలేక సతమతం ● మూడేళ్లుగా అమలు కాని సరెండర్ ఆఫ్ ఎర్న్ లీవ్స్ ● జీపీఎఫ్‌ను రూ. లక్షకే పరిమితం చేయడంపై వేతనజీవుల ఆగ్రహం



అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి2: రాష్ట్ర ప్రభుత్వ తీరుతో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు విసిగిపోతున్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అలవెన్సులు కాదు కనీసం 1వ తేదీనే జీతం, పెన్షన్లు అందుకునే పరిస్థితి లేకుండాపోయాయని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే ఉద్యోగులకు అందాల్సిన రకరకాల అలవెన్సులను పెండింగ్‌లో ఉంచి ఆయా వర్గాలను తీవ్ర మానసిక వేదనకు గురిచేస్తోంది. జీతాలను నమ్ముకుని వివిధ రకాల లోన్లు తీసుకున్న ఉద్యోగులు ఈఎంఐలు కట్టుకోలేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సమయానికి సొమ్ము చెల్లించకపోవడంతో బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల నుంచి ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు. రెండవ తేదీ ముగిసినప్పటికీ... సగం సగం మందికే వేతనాలు, పెన్షన్లు విడుదలవడంతో మిగిలిన వారు తమకెప్పుడు అందుతాయోనన్న మిగిలిన వారు ఆందోళన చెందుతున్నారు. జిల్లా వ్యాప్తంగా అన్నిప్రభుత్వ కార్యాలయల్లో కలుపుకొని 40 వేలమందికిపైగా ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఇప్పటి వరకూ 20 శాతం మంది వరకూ జీతాలు పడినట్లు తెలుస్తోంది. ఇక ప్రభుత్వ పెన్షనర్ల విషయానికొస్తే జిల్లా వ్యాప్తంగా 25 వేల మంది ఉండగా... ఇప్పటి వరకూ కేవలం 5 వేల మందికి మాత్రమే ఖాతాలో సొమ్ము జమ అయినట్లు సమాచారం.

మూడేళ్లుగా అందని సరెండర్ ఆఫ్ ఎర్న్ లీవ్స్ నగదు

ప్రభుత్వ ఉద్యోగులకు అందించే సరెండర్ ఆఫ్ ఎర్న్ లీవ్స్ మూడేళ్లుగా అమలుకాకపోవడంతో ఉద్యోగ వర్గాలు ఆందోళన చెందుతున్నాయి. సంవత్సరానికి 15 రోజులు చొప్పున అమలయ్యే సెలవులకు సంబంధించిన నగదును సైతం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా కాలయాపన చేస్తుండటంతో ఆ వర్గాలు నిట్టూరుస్తున్నాయి. ఈ లీవ్స్ వాడుకోనే ఉద్యోగులు నగదు కోసం ఎన్నిసార్లు ఫైల్స్ సబ్మిట్ చేసుకున్నా ఆ డబ్బు రాకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీపీఎఫ్ విషయంలోనూ రాష్ట్ర ప్రభుత్వం అదే నిర్లక్ష్య వైఖరిని కనబరుస్తోందనే చెప్పాలి. ఉద్యోగులు దాచుకున్న డబ్బును అవసరాలకు వినియోగించుకుందామంటే అసలు జీపీఎఫ్ ఆన్‌లైన్‌లో కనిపించకుండా చేసింది. తాజాగా... ఉద్యోగుల నుంచి అసంతృప్తి వ్యక్తమవుతున్న నేపథ్యంలో జీపీఎఫ్ నిధులు ఇవ్వడానికి ముందుకొచ్చినప్పటికీ... వాటిని రూ. లక్ష వరకే పరిమితం చేయడంపై ఉద్యోగ వర్గాలు మండిపడుతున్నాయి. తాము దాచుకున్న సొమ్మును ఇచ్చేందుకు పరిమితి ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

ఇలాంటి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు..

● పెద్దనగౌడ్, ఏపీ ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు



నా సర్వీసులో ఇలాంటి ప్రభుత్వాన్ని ఎన్నడూ చూడలేదు. కనీసం మాకు ఇవ్వాల్సిన పెన్షన్‌ను సైతం 1వ తేదీన ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తోంది. ప్రభుత్వం నుంచి పెన్షనర్లకు అందాల్సిన పథకాల విషయంలోనూ కోతలు పెడుతూ ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ నెలకు సంబంధించి కేవలం 5 వేల మంది పెన్షనర్లకు మాత్రమే నగదు జమ అయ్యింది. ఇంక మిగిలిన వారి పరిస్థితి ఏంటి..? వారికి ఎప్పుడిస్తారు..? చాలా బాధాకరం. ఈ ప్రభుత్వం మారే వరకూ పెన్షనర్లకు ఇబ్బందులు తప్పేలా లేదు.

1వ తేదీనే జీతాలివ్వాలి..

●మనోహర్‌రెడ్డి, ఏపీ ఎన్జీఓ నగర అధ్యక్షుడు



రాష్ట్ర ప్రభుత్వం 1వ తేదీనే ఉద్యోగులకు జీతాలిచ్చి ఆదుకోవాలి. జీతంపైనే ఆధారపడి జీవిస్తున్న ఉద్యోగులకు జీతం ఆలస్యమైతే అనేక రకాలైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈఎంఐలు, హౌస్ లోన్లు చెల్లించక పోవడంతో అధిక వడ్డీ భరించాల్సి వస్తోంది. సరెండర్ ఆఫ్ ఎర్న్ లీవ్స్ నగదును వెంటనే రిలీజ్ చేసి ఉద్యోగులను ఆదుకోవాలి. జీపీఎఫ్ విషయంలో విధించిన రూ.లక్ష పరిమితిని తీసేసి మునుపటిలాగానే 75 శాతం చొప్పున విడుదల చేయాలి.

చంద్రబాబు పర్యటన షెడ్యూల్ ఖరారు

పుట్టపర్తి, మార్చి2(ఆంధ్రజ్యోతి): పెనుకొండ సమీపంలోని కియ పరిశ్రమ వద్ద నిర్వహిస్తున్న రా.. కదలిరా.. సభకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు సోమవారం హాజరుకానున్నారు. ఆయన పర్యటనకు సంబంధించిన షెడ్యూల్ ఖరారైంది. చంద్రబాబు హైదరాబాద్‌లో ఈనెల 4న మధ్యాహ్నం 12.30కి బయలుదేరి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుంటారు. ప్రత్యేక విమానంలో ఒంటి గంటకు బెంగుళూరు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో మధ్యాహ్నం 2.45కి పెనుకొండ మండలం ఎర్రమంచి వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌లో దిగుతారు. కియ ఎదురుగా రా.. కదలిరా.. సభా వేదిక వద్దకు చేరుకుంటారు. 3 గంటల నుంచి 4.30దాకా బహిరంగ సభలో చంద్రబాబు ప్రసగింస్తారు. 4.45కి ఎర్రమంచి హెలీప్యాడ్ నుంచి బయలుదేరి బెంగుళూరు హెచ్ఏఎల్ విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెదరాబాద్ వెళ్లారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి స్పెషల్‌డ్రైవ్

అనంతపురం టౌన్ మార్చి 2: జిల్లాలో ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీకి స్పెషల్‌డ్రైవ్ చేపడుతున్నామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి జిల్లాకలెక్టరు గౌతమి తెలిపారు. శనివారం సీఎస్ పలుప్రభుత్వ పథకాల అమలుపై వీడియోకాన్ఫరెన్స్‌లో ఆరా తీశారు. అనంతరం కలెక్టరు మాట్లాడుతూ జిల్లాకు 5.11 లక్షల ఆరోగ్య శ్రీకార్డులు రావాల్సి ఉందన్నారు. ఇప్పటికి 1.90 లక్షల కార్డులు రాగా వాటిని స్పెషల్‌డ్రైవ్ చేపట్టి లబ్ధిదారులకు పంపిణీ చేస్తామన్నారు. జిల్లాలో 3.50 లక్షల ఆరోగ్యశ్రీ యాప్‌లో డౌన్‌లోడ్‌లు పూర్తయ్యాయని, మిగిలినవారికి వారి ఫోన్లలో చేయిస్తామన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

నిండు జీవితానికి రెండు చుక్కలు

● నేడు పల్స్ పోలియో కార్యక్రమం



పల్స్‌పోలియోపై ర్యాలీ చేపడుతున్న అధికారులు

అనంతపురం టౌన్, మార్చి 2: చిన్నారుల నిండు జీవితానికి రెండు చుక్కలు వేయించాలని జడ్పీ సీఈఓ నిధియా దేవి, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి సూచించారు. పల్స్ పోలియోపై అవగాహన కల్పించడంకోసం జిల్లావ్యాప్తంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో శనివారం ర్యాలీలు నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద డీఎంహెచ్ఓ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ప్రధాన రహదారులపై ర్యాలీ కొనసాగింది. రెండు చుక్కల పోలియో డ్రాప్స్ వేయడంద్వారా పోలియో మహమ్మారిపై విజయం సాధించవచ్చని వారు అన్నారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో చుక్కలు వేస్తారని అన్నారు. జిల్లాలో 2,79,980 మంది చిన్నారులు ఉన్నారని, వీరందరికి పోలియో చుక్కలు వేసేందుకు 1,785 కేంద్రాలను ఏర్పాటు చేశామని అన్నారు. పోలియో చుక్కలు వేయడానికి సిబ్బందిని నియమించామని తెలిపారు. ఆదివారం చుక్కలు వేయించుకోనివారిని గుర్తించేందుకు సోమ, మంగళవారాలలో ఇంటింటికీ సిబ్బంది వెళ్లి, పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ కోగటం విజయ భాస్కర్ రెడ్డి, డీఐఓ డాక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఖరీదైన వైద్య పరీక్షలు ఉచితంగా..

● క్యాన్సర్ పరీక్షలకు క్యూ కట్టిన జనం ● మొదటి రోజు 300 మందికి.. ● నేడు కూడా శిబిరం

హిందూపురం, మార్చి 2: కార్పొరేట్ ఆస్పత్రుల్లో అందే ఖరీదైన వైద్య పరీక్షలను ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచన మేరకు ఇక్కడికే వచ్చి ఉచితంగా చేస్తున్నట్లు వైద్యులు తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన బసవతారకం ఇండో-అమెరికన్ ఆస్పత్రి పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్ధారణ ఉచిత పరీక్షల సంచార వైద్య శిబిరం శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసం వద్ద నిర్వహించారు. సుమారు రూ.3కోట్ల విలువచేసే అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసే సంచార వైద్యశాల వాహనాన్ని కొనుగోలు చేసిన వెంటనే హిందూపురానికి పంపారు. ఇక్కడే ఈ వాహనాన్ని ప్రారంభిస్తున్నట్లు వైద్యులు తెలిపారు. ఆదివారం కూడా ఇక్కడే ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆస్పత్రి వైద్యులు సుధాకర్, శ్రావణికుమారి, హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్, ఆర్ఎంఓ రుక్మిణమ్మ వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. 300మందికి ఎక్స్‌రే, అల్ట్రా సౌండ్ తదితర వైద్య పరీక్షలు చేశారు. ఒకరికి ఇబ్బందికరంగా ఉండడంతో ఎమ్మెల్యే సొంత ఖర్చులతో అంబులెన్స్ ద్వారా కర్నూలుకు పంపారు. మిగిలిన వారికి హైదరాబాద్ రావాలని సూచించారు. అనంతరం టీడీపీ నేత డా.సురేంద్ర, కోఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజల సౌకర్యార్థం ఖరీదైన వైద్య పరీక్షలను ఉచితంగా చేయాలని ఎమ్మెల్యే ఆదేశించడంతో నూతనంగా కొనుగోలుచేసిన వాహనాన్ని ఇక్కడకు పంపారన్నారు. దీనిని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే సేవా కార్యక్రమాలకు తమవంతు కృషి చేస్తున్నారన్నారు. కరోనా ఆపదకాలంలో రూ.కోట్ల విలువచేసే మందులు, వైద్య పరికరాలను ఇక్కడకు పంపారన్నారు. ఆయన ఎక్కడున్నా ప్రజల బాగోగులపై ప్రత్యేక దృష్టి సారిస్తుంటారని పేర్కొన్నారు.



వైద్యశిబిరంలో పేర్లు నమోదు చేసుకుంటున్న దృశ్యం

పోలీసుల సంక్షేమమే పరమావధి: డీఐజీ

అనంతపురం క్రైం,మార్చి 2: పోలీస్ సిబ్బంది, కుటుంబాల సంక్షేమమే పరమావధి అని అనంతపురం రేంజ్ డీఐజీ అమ్మిరెడ్డి అన్నారు. జిల్లా పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎస్పీ అన్బురాజన్ సంకల్పంతో నూతనంగా నిర్మించిన, పునరుద్ధరించిన వివిధ సంక్షేమ కార్యక్రమాలను డీఐజీ ప్రారంభించారు. ఇండోర్ స్టేడియంను ఎస్పీతో కలిసి డీఐజీ ఓపెన్ చేశారు. పోలీస్ యూనిట్ ఆసుపత్రి పునరిద్ధరించిన అనంతరం ఆసుపత్రిని ప్రారంభించారు. జిల్లా పోలీసు ట్రాన్స్‌పోర్ట్ విభాగం ప్రాంగణంలో కొత్తగా నిర్మించిన ఎంటి ల్యూబ్రికేషన్స్ స్టోర్స్ భవనాన్ని ప్రారంభించారు. అదనపు ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, రామక్రిష్ణ, ఏఆర్ అదనపు ఎస్పీ లక్ష్మీనారాయణరెడ్డి, డీఎస్పీలు వీరరాఘవరెడ్డి, టీవీ శివారెడ్డి పాల్గొన్నారు.

పదోన్నతి కల్పించిన ఎస్పీకి కృతజ్ఞతలు: హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి కల్పించినందుకు ఎస్పీ అన్బురాజన్‌కు సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. శ్రీ సత్యసాయి జిల్లా పట్నం పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నూర్ మహమ్మద్, హిందూపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న నీలవేణికి హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఎస్ఐగా పదోన్నతి లభించింది. నూర్‌మహమ్మద్‌ను కనగానపల్లికి, నీలవేణిని గుంతకల్లు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరు పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులతో కలిసి ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అన్నమయ్య జిల్లా నుంచి జిల్లా ఏఆర్‌కు బదిలీపై వచ్చిన జాఫర్ ఎస్పీని కలిశారు. సాకేత్రిలోక్‌నాథ్, జాఫర్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసుల నాయుడు ఉన్నారు.



పోలీస్ సంక్షేమ కార్యక్రమాల ప్రారంభోత్సవంలో డీఐజీ, ఎస్పీ

ప్రేమికుడి ఆత్మహత్య

● ప్రియురాలు ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్, మార్చి 2: ప్రేమికుడు ఆత్మహత్య చేసుకోవడంతో ప్రియురాలు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన శనివారం కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామంలో జరిగింది. ఔట్‌పోస్టు పోలీసులు, గ్రామస్థులు తెలిపిన మేరకు కళ్యాణదుర్గం మండలంలోని కామక్కపల్లికి చెందిన హరిభూషణ్ (25), ఓ యువతి ప్రేమించుకున్నారు. వారిద్దరూ మూడు రోజుల కిందట ఇంట్లో నుంచి వెళ్లిపోయారు. యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడానికి శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లారు. పోలీసుల సమక్షంలోనే ఆ యువతికి తల్లిదండ్రులు ఫోన్ చేశారు. 'సార్ మేము మేజర్లం. పెళ్లి చేసుకున్నాం. స్టేషన్‌కి వస్తున్నాం' అని పోలీసులకు ఫోన్‌లోనే చెప్పారు. వారు వస్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి మార్గమధ్యలో యువకుడి మేనమామ బాబుజీ ఇంటికి వెళ్లారు. తన తల్లిదండ్రులు తమ ప్రేమకు ఒప్పుకోరు అనే భయంతో యువకుడు తన మేనమామ ఇంటి వద్దే బహిర్భూమికి అని వెళ్లి చెట్టుకు ఉరివేసుకున్నాడు. ప్రియుడు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ యువతి తట్టుకోలేక ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. యువతి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

సీఎం జగన్‌పై దళితులకు నమ్మకం లేదు

● మాజీ మంత్రి పరిటాల సునీత


పరిటాలసునీత సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ కార్యకర్తలు

రామగిరి, మార్చి 2: సీఎం జగన్‌ను దళితులు నమ్మే పరిస్థితుల్లో లేరని వారంతా టీడీపీవైపే వస్తున్నారని మాజీ మంత్రి పరిటాలసునీత అన్నారు. శనివారం వెంకటాపురం గ్రామంలో పేరూరు పంచాయతీ కురుకుంట్ల కాలనీకి చెందిన వైసీపీ దళిత నాయకులు, కార్యకర్తలు టీడీపీలోకి చేరారు. సాయి, నారాయణ, ప్రకాశ్, హరి, మాధవయ్య, మూర్తి, శివ, గంగరత్నమ్మ, పెద్దక్క, అంజనేయులు వారి కుటుంబసభ్యులతో రాగా వారందరికీ పరిటాలసునీత పార్టీ కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఆమె మాట్లాడుతూ... వైసీపీలో దళితులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వారికి ఏ మాత్రం ప్రాధాన్యత లేదన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

బండారు శ్రావణిశ్రీకి అభినందనలు


శ్రావణిశ్రీకి అభినందనలు తెలుపుతున్న టీడీపీ నాయకులు

శింగనమల, మార్చి 2: టీడీపీ శింగనమల నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ ఇంటి వద్ద కోలాహలం నెలకొంది. శనివారం అనంతపురంలోని ఆమె ఇంటి వద్ద తెలుగుయవత నాయకులు వెళ్లి పుష్పగుచ్చాలు ఇచ్చి ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. తెలుగుయవత నాయకులు రాజశేఖర్ యాదవ్,అమనాథ్ చలపతి, కిశోర్‌తోపాటు శ్రావణికి అభ్యర్థిత్వం ఖవడంతో అమె విజయం ఖాయమన్నారు.

మోటార్లు మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

శింగనమల, మార్చి 2: టీడీపీ హయాంలో రైతులకు మంజూరు చేసిన ఉచిత మోటార్లను అమ్ముకొన్న వైసీపీ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ శింగనమల నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ డిమాండ్ చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో ఉచిత మోటార్లను అమ్మేశాడు అనే కథనం ప్రచురితం కావడంపై ఆమె స్పందించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో రైతులకు విద్యుత్ ఆదా చేయాలని 5 హెచ్‌పీ మోటార్లు ఉచితంగా మంజూరు చేశారన్నారు. శింగనమల మండలానికి 1050 వ్యవసాయ మోటార్లు మంజూరు కాగా, కేవలం 298 మాత్రమే చేరాయన్నారు. మిగిలిన మోటార్లు వస్తేనే రైతులకు పంపిణీ చేస్తామని అధికారులు చెప్పారన్నారు. ఈ సమయంలో ఎన్నికలు రావడంతో, వైసీపీ అధికారంలోకి వచ్చిందని, ఉచిత మోటార్లు పంపిణీ చేయలేదన్నారు. ఇదే అదునుగా భావించిన వైసీపీ నాయకుడు మోటార్లను స్వాధీనం చేసుకుని రైతులకు ఇవ్వకుండా సొంతంగా అమ్ముకుని లక్షలు గడించాడని ఆరోపించారు. అతనిని అధికారులు విచారించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వినికిడి దినోత్సవం

అనంతపురం టౌన్ మార్చి 2: జిల్లా కేంద్రంలోని కిమ్స్‌సవేరా ఆస్పత్రిలో వినికిడి దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. వినికిడి లోపం ఉండి కాక్లియార్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు చేయించుకున్న చిన్నారులచేత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవరెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు 26మంది వినికిడి లోపం ఉన్న చిన్నారులకు శస్త్రచికిత్సలు చేశామన్నారు. ఆ పిల్లలు ఈరోజు నృత్యాలు చేస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. మానవతా రక్తదాతల సంస్థ అధినేత తరిమెల అమరనాథరెడ్డి, డాక్టర్లు ఆబీబ్‌రాజా, రవిశంకర్, మహేష్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీ: జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణలో ఉన్న డీఈఐసీ కేంద్రంలో వినికిడిలోపం ఉన్న చిన్నారులకు ఉచితంగా వినికిడి యంత్రాలను పంపిణీ చేశారు. వినికిడి దినోత్సవం సందర్భంగా వైద్యశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈబీ దేవి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు ముఖ్య అతిథులుగా పాల్గొని పిల్లలకు వినికిడి యంత్రాలను అందజేశారు. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ కిరణ్, డాక్టర్లు అనుపమ జేమ్స్, సుజాత, నారాయణస్వామి, మేనేజరు రజిత పాల్గొన్నారు.

జనసేన, టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందాం

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 2: రానున్న ఎన్నికల్లో అందరూ కష్టపడి జనసేన, టీడీపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామని జనసేన పార్టీ రాయలసీమ మహిళా విభాగం కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత పిలుపునిచ్చారు. శనివారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా ఇందిరానగర్‌లో పర్యటించారు. ఆమె మాట్లాడుతూ... జగన్ రెడ్డి పరిపాలనలో అరాచకాలు, అక్రమాలు పెరిగిపోయాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలంటే జనసేన, టీడీపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుందామన్నారు.

నేడు శ్రీరామకృష్ణయ్య జయంతి

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 2: రాయలసీమ వరప్రదాయని హంద్రీనీవా సుజల స్రవంతి పథకం రూపశిల్పి ఇంజనీరు శ్రీరామకృష్ణయ్య జయంతి ఆదివారం నిర్వహించనున్నట్లు అనంత హక్కుల పోరాట సంఘం అధ్యక్షుడు రాహుల్ తెలిపారు. స్థానిక అంబేడ్కర్ రోడ్డులోని తెలుగుతల్లి కూడలి వద్ద ఉన్న శ్రీరామకృష్ణయ్య విగ్రహం వద్ద ఉదయం 9గంటలకు జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు.

చీనీ కాయలు టన్ను రూ.16వేలు

అనంతపురంరూరల్, మార్చి 2: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.16వేలు, కనిష్టంగా రూ.8వేలు, సరాసరి రూ.13వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 76 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

అనంతపురంరూరల్, మార్చి 3: విద్యుత్‌లైన్ల మరమ్మతుల్లో భాగంగా నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ టౌన్-2 డీఈఈ లక్ష్మీనారాయణ తెలిపారు. ఆదివారం బళ్లారి రోడ్డులోని సబ్‌స్టేషన్‌లో కొత్తగా 33కేవీ బ్రేకర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈనేపథ్యంలో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు తపోవనం, బళ్లారిరోడ్డు, కళ్యాణదుర్గం రోడ్డు, రుద్రంపేట, రాంనగర్, లక్ష్మీనగర్, కోవూర్‌నగర్, మొదటి రోడ్డు నుంచి ఆరవరోడ్డు వరకు, ఆజాద్‌నగర్, శ్రీనగర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

5లోపు అభ్యంతరాలు తెలియజేయండి

అనంతపురంరూరల్, మార్చి 2: రైతు భరోసా కేంద్రాల్లో సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించిన రబీ ఈ పంట నమోదు రైతు జాబితాను పరిశీలించి అందులో అభ్యంతరాలుంటే 5వ తేదీలోగా తెలియజేయాలని వ్యవసాయాశాఖ ఏడీ రవి కోరారు. శనివారం మండలంలోని ఎ.నారాయణపురంలోని రైతు భరోసా కేంద్రంలో ఏఓ సోమశేఖర్‌తో కలసి ఆయన గ్రామ సభను నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే అధికారి నాగలత, రైతులు పాల్గొన్నారు.

జర్నలిస్టు క్రికెట్ పోటీల విజేత కడప

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 2: జర్నలిస్టు క్రికెట్ పోటీల విజేతగా కడప జిల్లా జట్టు నిలిచింది. వారం రోజులుగా మొదటి రాష్ట్రస్థాయి జర్నలిస్టు క్రికెట్ పోటీలు స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించారు. శనివారం ఫైనల్ పోటీలు జరిగాయి. కడప, వైజాగ్ జట్ల మధ్య పోరు సాగింది. 16.3ఓవర్లలో వైజాగ్ 67పరుగులకే కుప్పకూలింది. అనంతరం బరిలోకి దిగిన కడప జట్టు 9.2ఓవర్లలో 2వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అలవోకగా చేదించింది. దీంతో కడప జట్టు చాంపియన్స్‌గా నిలిచింది. ముఖ్య అతిథులుగా హాజరైన కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఏపీడబ్ల్యూజేయూ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, డీఎస్‌డీఓ నరసింహారెడ్డి, సీనియర్ జర్నలిస్టులు పాల్గొన్నారు.


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కలెక్టర్ గౌతమి

ధర్మవరంలో టీడీపీ ప్రభంజనమేంటో చూపిద్దాం

● పెనుకొండ రా.. కదలిరా.. సభకు తరలిరండి
● టీడీపీ ధర్మవరం ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్



అనంతపురం అర్బన్, మార్చి 2: ధర్మవరం నియోజకవర్గంలో టీడీపీ ప్రభంజనమెంటో చూపిద్దామని ఆ నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. శనివారం అనంతపురంలోని తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 4వతేదీ పెనుకొండలో జరిగే రా కదలిరా బహిరంగ సభకు ధర్మవరం నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని కోరారు. పెనుకొండలో జరిగే రా కదలిరా సభ చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలన్నారు. ఇప్పటికే సూపర్ సిక్స్ పథకాలకు మంచి స్పందన వచ్చిందని, చంద్రబాబు మరిన్ని పథకాలు తీసుకొచ్చే అవకాశం ఉందన్నారు. గతంలో నారాలోకేశ్ యువగళం పాదయాత్ర ధర్మవరం నియోజకవర్గంలో హైలెట్‌గా నిలిచిందని, అదే తరహాలో ఈ సభను విజయవంతం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు.

రా.. కదలిరా.. సభకు తరలిరండి..!


మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, టీడీపీ నాయకులు

అనంతపురంరూరల్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు పెనుకొండ నియోజకవర్గం కియా మోటర్స్ వద్ద 4వ తేదీన చేపట్టనున్న రా.. కదలిరా సభకు టీడీపీ శ్రేణులు తరలిరావాలని మండల కన్వీనర్ జింకా సూర్యనాయణ పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో మాజీ జట్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాము రాయి రఘు, మాజీ మండల కన్వీనర్ చల్లా జయకృష్ణ, తెలుగురైతు రాప్తాడు నియోజకవర్గం అధ్యక్షుడు నారాయణస్వామి, రామాంజనేయులు, రాగే మురళీమోహన్, బాబావలి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అనుబంధసంఘాల నాయకులు, మహిళానాయకురాలు పెద్ద ఎత్తున హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో సాకే బ్రహ్మ, నరేష్ పాల్గొన్నారు.

రాప్తాడు: శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ సమీపం కియా కార్ల పరిశ్రమ వద్ద 4వ తేదీన సోమవారం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో నిర్వహించే రా కదలిరా సభకు నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని మండల కన్వీనర్ పంపు కొండప్ప, ప్రధాన కార్యదర్శి దగ్గుపాటి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సర్పంచులు సాకే తిరుపాలు, ఉజ్జినప్ప, నరేష్, టీడీపీ నాయకులు కొత్తపల్లి నారాయణస్వామి, గేటు సత్తి, నరేంద్ర, మహేష్, శివ పాల్గొన్నారు.

రామగిరి : టీడీపీ అధినేత చంద్రబాబు సోమవారం పెనుకొండకు రా కదలిరా సభకు రానున్నారని, కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని ఆ పార్టీ నాయకులు పిలుపు నిచ్చారు. శనివారం రామగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కుంటిమద్ది రంగయ్య, సీనియర్‌నాయకులు రామ్మూర్తినాయుడు, పరంధామ యాదవ్, సుధాకర్, వెంకటేశ్ మాట్లాడారు. సభకు భారీ స్థాయిలో టీడీపీ శ్రేణులు తరలివెళ్దామని పిలుపు నిచ్చారు.

చెన్నేకొత్తపల్లి: పెనుకొండ సమీపంలోని కియా కార్ల పరిశ్రమ ఎదురుగా సోమవారం మధ్యాహ్నం జరిగే రా కదలిరా బహిరంగసభను విజయవంతం చేయాలని టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి పిలుపు నిచ్చారు. సీకేపల్లి టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. చంద్రబాబు నేతృత్వంలో భారీ బహిరంగసభ ఏర్పాటు చేశామన్నారు. మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, పరిటాల అభిమానులు పెద్దఎత్తున తరలిరావాలన్నారు. సమావేశంలో కుంటిమద్దిరంగయ్య, ముత్యాల్‌రెడ్డి, దం డు ఓబుశేశు, అంకే అమరేంద్ర, ముత్యాలప్ప, రామకృష్ణారెడ్డి, మాదెం సూర్యనారాయణరెడ్డి, శివ, రామాంజి, గేటు కిష్టప్ప, సూరి, వెంకటాచారి, ఓబిరెడ్డి, చెన్నకేశవులగౌడ్, అమరేంద్రరెడ్డి, ఉత్తరకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎల్.నారాయణచౌదరి, నాయకులు

గుర్తుతెలియని వృద్ధుడి ఆత్మహత్య

గార్లదిన్నె, మార్చి 2: మండలంలోని కనుంపల్లి వద్ద 44వ జాతీయ రహదారి సమీప పొలాల్లో గుర్తు తెలియని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు 70 సంవత్సరాల వయస్సున్న వృద్ధుడు వేపచెట్టుకు ఉరివేసుకుని మృతి చెందాడన్నారు. మృతుడు తెల్ల షర్టు, తెల్ల పంచె ధరించాడన్నారు. మృతుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రెండు సార్లు టోల్ వసూలు

● మరూరు టోల్ గేట్ సిబ్బంది ఇష్టారాజ్యం
● సోషల్ మీడియాలో వీడియో వైరల్

రాప్తాడు, మార్చి 2: మరూరు టోల్‌గేట్ వద్ద సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రెండు సార్లు టోల్ వసూలు చేస్తున్నారని ఓ ప్రయాణికుడు తన ఆవేదనను వీడియో ద్వారా వ్యక్తం చేశాడు. ఆ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వాహనం టోల్ గేట్ క్రాస్ చేసేటప్పుడు ఒకసారి టోల్ మొత్తం ఫాస్ట్‌టాగ్ నుంచి కట్ అవుతోందని కొంత దూరం వెళ్లాక మరోకసారి వసూలు చేస్తున్నారని, తరచూ టోల్ సిబ్బంది ఇలానే రెండు సార్లు వసూలు చేస్తున్నారని ప్రయాణికుడు ప్రశ్నించాడు. టోల్ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తూ వాహనాల నుంచి రెండుసార్లు టోల్ వసూలు చేసి సాయంత్రానికి వేలల్లో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపాడు. శనివారం మరూరు టోల్ గేట్ క్రాస్ చేసేటప్పుడు టోల్ నెంబర్‌కు కాకుండా సిబ్బంది వ్యక్తిగత నెంబర్‌కు ఎందుకు టోల్ మొత్తం వసూలు చేశావని టోల్ సిబ్బందిని ప్రశ్నించాడు. వసూలు చేసిన టోల్ మొత్తానికి టికెట్ ఇచ్చేందుకు గంట ఎందుకు అవుతుందని, గంటల సేపు టోల్ గేట్ వద్ద నిలబడాలా అని నిలదీశాడు. టోల్ సిబ్బంది అక్రమాలను నేషనల్ హైవే అథారిటీ అధికారులు పట్టించుకోలేదని తెలిపాడు. ఈ వివాదంపై మరూరు టోల్ గేట్ మేనేజర్ నాగలింగారెడ్డికి ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు.

పోలియో చుక్కలు వేయించండి


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది

గార్లదిన్నె, మార్చి 2: మండలంలో 0-5 సంవత్సరాల వయస్సులోపు ఉన్న పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలని వైద్యాధికారి గౌతమి సూచించారు. శనివారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సర్కిల్ వరకు వైద్య సిబ్బంది, విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 5 సంవత్సరాల వయస్సులో ఉన్న పిల్లలు 6247 మంది ఉన్నారన్నారు. వీరందరికి ఆదివారం పోలియో చుక్కలు వేస్తారన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు పద్మావతి, దిలీప్, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తారణ అధికారి నాగేశ్వరరావు, పీహెచ్‌ఎన్‌ఎం అరుణ, సూపర్‌వైజర్లు సూర్యకళ, కృష్ణమోహన్, విశ్వనాథ్, గాయత్రి పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ సభ

అనంతపురం కల్చరల్, మార్చి 2: ఖమ్మంకు చెందిన కవి మువ్వా శ్రీనివాసరావు రచించిన కవితా సంపుటి 'అనితరుడు' పుస్తకాన్ని స్థానిక గ్రంథాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఆవిష్కరించనున్నట్లు అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర శాస్త్రి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సాహితీకారులు,సాహిత్యాభిమానులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేత్రదానం అభినందనీయం: కమిషనర్

అనంతపురం క్రైం, మార్చి 2: నేత్రదానం పుణ్యకార్యం అని, మరణానంతరం మన నేత్రాలు ఇద్దరికి ఉపయోగపడతాయని నగర కమిషనర్ మేఘస్వరూప్ అన్నారు. శనివారం నగరపాలిక కార్యాలయంలో సాయిట్రస్ట్ ఆధ్వర్యంలో ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి నేత్రదానం చేసిన ధనలక్ష్మి, రాజ్యలక్ష్మి కుటుంబ సభ్యులకు కమిషనర్ ప్రశంసాపత్రాలు అందజేశారు.

లక్ష్యంతో చదవాలి: చిన్నప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదవాలని కమిషనర్ అన్నారు. నగరపాలిక పరిధిలోని ప్రభాకర్ జీ నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి ఆధ్వర్యంలో పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ... పట్టుదల, ఏకాగ్రత, ఓర్పు కలిగి ఉంటే ఎంతటి ఉన్నత స్థానాన్నైనా చేరుకోగలరన్నారు.

కాలువల నిర్మాణంపై వాగ్వాదం

అనంతపురం రూరల్, మార్చి 2: మండలంలోని రుద్రంపేట పంచాయతీ పంతుల కాలనీలో కాలువల నిర్మాణంపై స్థానికులు వైసీపీ నాయకులతో శనివారం వాగ్వాదానికి దిగారు. కాలువలు నిర్మాణంలో భాగంగా ఇళ్లకు సంబంధించిన నీటి పైపులు మార్చు ఇళ్ల యజమానులతో డబ్బులు వసూలు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. పైపులైన్ మార్చాలంటే రూ.1500 ఇంటికి ఇవ్వాలంటున్నారన్నారు. రోడ్డు ఒక వైపు నుంచి మరో వైపుకు మార్చాలంటే రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని వాపోతున్నారు. ఇంటి పన్ను, నీటి పన్ను అన్నీ కడుతున్నాం. అలాటప్పుడే పంచాయతీ వారే పైపులైన్ మార్చాలి. అలాకుండా తమతో డబ్బులు తీసుకుని పైపులు మార్చం ఏంటని ప్రశ్నించారు. స్థానికులు నాయకులతో వాదనలకు దిగారు. ఇదే సందర్భంగా స్థానిక సమస్యను టీడీపీ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇరువురి నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

రామగిరి, మార్చి 2: మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో ఆరో తరగతి ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సర్వేశ్వరి శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశం కోసం ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ.75, మిగిలిన వారు రూ.150 దరఖాస్తు రుసుం చెల్లించి 31వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 21న పరీక్ష నిర్వహించి విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఆదర్శపాఠశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

చలో అమరావతికి తరలిరండి

చెన్నేకొత్తపల్లి, మార్చి 2: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో మార్చి 9న చలో అమరావతికి దివ్యాంగులు తరలివరాలని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు స్వామాట్ మధు పిలుపు నిచ్చారు. చెన్నేకొత్తపల్లిలో శనివారం చలో అమరావతి దివ్యాంగుల మహాగర్జన కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో నరసింహులు, దబ్బల శ్రీరాములు, సీఎం నరసింహులు, మల్లెల తిప్పన్న పాల్గొన్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక శిబిరాలు

అనంతపురం సెంట్రల్, మార్చి 2: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పునర్‌నిర్మాణ కార్యకలాపాలు నిర్వహించేందుకు నేషనల్ సర్వీసెస్ స్కీమ్(ఎన్‌ఎస్‌ఎస్) ద్వారా ప్రత్యేక శిబిరాలను నిర్వహించేందుకు కళాశాలల విద్యార్థులు నడుం బిగించారు. ఆయా కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌ల ప్రోగ్రాం ఆఫీసర్(పీఓ)ల పర్యవేక్షణలో వివిధ ప్రాంతాల్లో శిబిరాలను ఏర్పాటుచేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక శిబిరాల ద్వారా ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు ఏడురోజుల పాటు క్షేత్రస్థాయిలో సేవల్లో నిమగ్నమయ్యారు.

● ఎస్వీ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీఓ ఆనంద్‌బాబు, పురుషోత్తం ఆధ్వర్యంలో బి.యాలేరు గ్రామంలో రక్తహీనతపై అవగాహన ర్యాలీ నిర్వహించిన వలంటీర్లు శ్రమదానంలో భాగంగా మురుగు కాల్వలను శుభ్రంచేశారు.

● కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పీఓలు ఫాతిమా మున్నీసా బేగం, రామకృష్ణ, రేణుకాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ శంకరయ్య, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ పర్వీన్ ప్రారంభించారు.


మురుగు కాలువను శుభ్రంచేస్తున్న ఎస్వీ డిగ్రీకళాశాల విద్యార్థులు

● ఎస్కేయూ ఆర్ట్స్ అండ్స్ సైన్స్ కళాశాల పీఓ అనురాధ ఆధ్వర్యంలో చిన్నకుంట గ్రామంలో కాలానుగున వ్యాధులపై చైతన్య ర్యాలీ నిర్వహించి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంపై అవగాహన కల్పించారు.

● ఎస్కేయూ ఫార్మసీ కళాశాల పీఓ సత్యసౌమ్య ఆధ్వర్యంలో ఆకుతోటపల్లిలో నిర్వహించిన బోన్ మ్యారో డెన్సిటీ చెకప్ క్యాంప్‌ను రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ప్రారంభించి గ్రామ ప్రజలకు ఉచిత పరీక్షలు చేశారు.

● ఎస్కేయూ ఇంజనీరింగ్ కళాశాల పీఓలో ఉషారాణి, వరలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ప్రారంభించి చికిత్స, జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఇంటి వద్ద చిన్నపాటి గొడవ

● 121 చీనీ చెట్లు నరికివేసిన బంధువులు

శింగనమల, మార్చి 2: ఇంటి ముందు పేడనీళ్ల విషయంపై జరిగిన చిన్నపాటి గొడవకు జలాలపురం గ్రామానికి చెందిన జోగి గంగరాజు చెందిన 121 చీనీ చెట్లను సమీప బంధువులు నరికివేసిన సంఘటన జూలాకాల్వలో శనివారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి... పెద్ద జలాలపురం గ్రామానికి చెందిన రైతు జోగి గంగరాజు జూలా కాలువ రెవెన్యూ పొలం సర్వే నెం.307-4లో 2.74 ఎకరాల్లో 420 చీనీ చెట్లను సాగుచేస్తున్నాడు. శుక్రవారం గంగరాజు ఇంటి వద్ద తమ బంధువులతో పేడనీళ్లు చల్లే సమయంలో రెండు కుటుంబాల మధ్య చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. శనివారం ఉదయం గంగారాజు పొలం వద్దకు వెళ్లి చూడా నాలుగు సంవత్సరాల 121 చీనీ చెట్లను నిరికివేసినట్లు గుర్తించాడు. చెట్లను కన్నబిడ్డలకన్నా ఎక్కువగా చూసుకనాన్నమని, తీరా కాపు వచ్చే సమయంలో నరికివేయడంతో రైతు దంపతులు గంగరాజు, గంగరత్నమ్మ కన్నీరుమున్నీరయ్యా. విషయం తెలుసుకున్న సీఐ శ్రీధర్, ఏఎస్ఐ చితంబరయ్య సంఘటనా స్థలానికి చేరుకుని నరికివేసిన చెట్లను పరిశీలించారు. బంధువులైన పెద్దన్న, గంగిరెడ్డిగంగాధర్, భోగాతి నారాయణస్వామి, నాగవేణి, రత్నమ్మపై అనూమానలు ఉన్నాయని బాధితుడు ఫిర్యాదు చేశాడు. గుర్తు తెలియని వ్యక్తులు చెట్లను నరికివేసినట్లు కేసు నమోదు చేశామని, అనుమానితులను విచారిస్తామని సీఐ తెలిపారు.


రైతు గంగరాజు పొలంలో నరికేసిన చీని చెట్లు

అయ్యప్పస్వామిగా కాశీవిశ్వేశ్వరుడు


స్వామివారి నగరోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అనంతపురం కల్చరల్, మార్చి 2: స్థానిక మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం స్వామివారు అయ్యప్పస్వామిగా భక్తులకు కనువిందు చేశారు. ఉదయం ఆలయంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు చేశారు. ఆలయ ఆవరణలో దీక్షాహోమం నిర్వహించారు. సాయంత్రం వివిధరకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించిన వ్యాఘ్ర వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తిని ఆశీనులు గావించి అయ్యప్పస్వామిగా అలంకరించి ఊరేగించారు. ఆలయ ఈఓ రమేష్‌బాబు, అనువంశీకుడు హోసూరు రామసుబ్రహ్మణ్యం, ధర్మకర్తల మండలి సభ్యులు కల్పన, రాజేశ్వరి, వెంకటస్వామి, సురేష్‌బాబు, తిమ్మారెడ్డి, చంద్రశేఖర్, డి.సుబ్రహ్మణ్యం, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, పరమేష్, భక్తులు పాల్గొన్నారు.

అన్నివర్గాలను ఆదుకునేందుకే సూపర్‌సిక్స్ పథకాలు


కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్, మార్చి 2: అన్ని వర్గాలను ఆదుకునేందుకు సూపర్‌సిక్స్ పథకాలను తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిందని ఆ పార్టీ నాయకులు అన్నారు. కనగానపల్లి మండలంలోని ముత్తవకుంట్ల, తల్లిమడుగు గ్రామాల్లో శనివారం టీడీపీ నాయకులు బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల కన్వీనర్ యాతంపోతలయ్య, ముకుందనాయుడు, ఎంపీటీసీలు బిల్లేభాస్కర్, శ్రీరాములు, తెలుగుయువత బట్టాసురేష్‌చౌదరి, సర్పంచ్‌లు రామాంజి, సోమరచంద్రశేఖర్, పతకమూరి ఆంజనేయులు, నాగభూషణ, మనోహర్‌నాయుడు పాల్గొన్నారు. అలాగే సోమవారం పెనుకొండ వద్ద కియా పరిశ్రమ ప్రాంతంలో నిర్వహించే రా కదలిరా సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని నాయకులు పిలుపునిచ్చారు. ఎంపీటీసీ బిల్లేభాస్కర్, బట్టా సురేష్‌చౌదరి, పూజారి నాగభూషణ, చల్లాబాలకృష్ణ, మాదినేనిసుధాకర్, తిరుపాల్,స్రవంతి, రాములమ్మ, అనిత పాల్గొన్నారు.

బలిజలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి


మాట్లాడుతున్న బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య

అనంతపురం ప్రెస్ క్లబ్, మార్చి 2: బలిజలకు అన్ని ప్రధాన పార్టీలు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని రాయలసీమ బలిజ మహాసంఘం అధ్యక్షుడు శంకరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఆ సంఘం కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రాయలసీమ జిల్లాల్లో అత్యధిక జనాభా కలిగిన బలిజలకు అన్ని పార్టీలు అవకాశాలు కల్పించకుండా మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. ఆరేడు శాతం ఉన్న కొన్ని అగ్రకులాలు మాత్రమే అత్యధిక సీట్లు కేటాయించుకుంటూ బలిజ సామాజికవర్గాన్ని అన్యాయం చేస్తున్నాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి అనంత జిల్లాలో రెండు ఎమ్మెల్యే, ఒక ఎంపీ స్థానాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. కోశాధికారి కోనేటి సాయిప్రసాద్, రిటైర్డ్ ప్రిన్సిపల్ సురేష్, గూండా మురళీకృష్ణ, దండు శ్రీనివాసులు, సానె ప్రభాకర్, లింగమయ్యస్వామి, మధుసూదన్, గాలి మనోహర్, రామాంజనేయులు, సుధాకర్, గురుమూర్తి పాల్గొన్నారు.

ముగ్గురికి ఏఓలుగా ఉద్యోగోన్నతి

అనంతపురం విద్య, మార్చి 2: జిల్లా పరిషత్ మేనేజ్‌మెంట్‌లో ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లకు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు(ఏవో)గా ఉద్యోగోన్నతి కల్పించారు. రమాదేవి, షబ్బీర్ నియాజ్, శ్రీనివాసులుకు ఏవోలుగా ఉద్యోగోన్నతి కల్పించారు. ఈ రమాదేవిని తాడిమర్రి ఎంపీడీఓ ఆఫీస్‌కు ఏవోగా, షబ్బీర్ నియాజ్‌కు జిల్లాపరిషత్ కార్యాలయంలో ఏవోగా, శ్రీనివాసులును వజ్రకరూరు ఎంపీడీఓ ఆఫీస్ ఏవోగా నియమించారు. జడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ శనివారం తన చాంబర్‌లో అధికారులతో కలసి వారికి ఉత్తర్వులు అందజేశారు.

'ఓపెన్' పరీక్షలు సజావుగా నిర్వహించాలి

అనంతపురం విద్య, మార్చి 2: ఏపీ ఓపెన్ స్కూల్‌పరీక్షలు సజావుగా సాగేలా చూడాలని డీఈఓ వరలక్ష్మి, ఏసీ గోవింద్ నాయక్ కోరారు. శనివారం ఉపాధ్యాయభవన్‌లో ఓపెన్ టెన్త్, ఇంటర్ 2024 పరీక్షలకు సంబంధించని చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఓపెన్ టెన్త్ పరీక్షలకు 5 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 955 మంది పరీక్షలకు హాజరవుతారన్నారు. ఇంటర్ పరీక్షలకు సంబంధించి 12 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 2794 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం, ఎంఈఓలు ఓబుళపతి, లింగానాయక్, హెచ్ఎం లక్ష్మీనారాయణ, సీఎస్‌లు, డీఓలు పాల్గొన్నారు.

వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా రామచంద్రారెడ్డి

అనంతపురం అర్బన్, మార్చి 2: జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా వెన్నపూస రామచంద్రారెడ్డి నియమితుడయ్యారు. ఇదివరకు చైర్మన్‌గా పనిచేసిన రాజశేఖర్‌రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో నార్పల మండలానికి చెందిన వెన్నపూస రామచంద్రారెడ్డిని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది.

ఆలయ నిర్మాణానికి ముంటిమడుగు వితరణ

గార్లదిన్నె, మార్చి 2: మండలంలోని కేశవాపురం గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ ఆలయ నిర్మాణానికి టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి శనివారం రూ. 1,11,000 గ్రామస్థులకు అందచేశారు. క్లస్టర్ ఇంచార్జ్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నూర్ మహమ్మద్‌కి ఎమ్మెల్యే సీటు కేటాయించండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, మార్చి 2: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అనంత అర్బన్ ఎమ్మెల్యే టికెట్ మాజీ మున్సిపల్ చైర్మన్ నూర్ మహమ్మద్‌కి కేటాయించాలని దూదేకుల నూర్‌బాష సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నబీరసూల్ డిమాండ్ చేశారు. శనివారం ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అనంతపురం అర్బన్‌లో 70 వేలకు పైగా ముస్లిం, మైనార్టీల ఓట్లు ఉన్నాయన్నారు. అన్ని రాజకీయ పార్టీలు దూదేకుల, ముస్లింమైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నాయే తప్పా రాజకీయ ప్రధాన్యం కల్పించడం లేదని మండిపడ్డారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఖలందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లీపీరా, కోశాధికారి గౌస్‌పీరా, గౌరవాధ్యక్షులు మస్తాన్‌వలి, నిజాం, రహీం పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పూర్వవిద్యార్థులు, కళాశాల యాజమాన్యం సభ్యుల గ్రూప్ ఫొటో

అనంతపురంరూరల్,మార్చి 2: స్థానిక పీవీకేకే కళాశాల ఆవరణంలోని బాలాజీ ఫార్మసీ కళాశాలలో పూర్వవిద్యార్థుల సమ్మేళనాన్ని శనివారం నిర్వహించారు. కళాశాలలో గతంలో చదివిన 100 మంది విద్యార్థులు కార్యక్రమాన్ని చేపట్టారు. పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, ఇంటర్వ్యూలకు ఎలా సిద్ధం కావాలి తదితర విషయాలను తెలియజేశారు. విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్, కోశాధికారి సింధూర, ప్రత్యేక అధికారి శ్రీనివాసులురెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీధర్ పాల్గొన్నారు.

చరిత్రలో మైలురాయిలా అంగన్‌వాడీల ఉద్యమం

● మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు



మాట్లాడుతున్న మాజీ మంత్రి కాలవ

రాయదుర్గం, మార్చి 2: అంగన్‌వాడీల ఉద్యమం చరిత్రలో మైలురాయిగా నిలిచిందని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలిపారు. శనివారం పట్టణంలోని సీతారామాంజనేయస్వామి కళ్యాణమంటపంలో సీఐటీయూ, యూటీఎఫ్‌ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి కాలవ మాట్లాడుతూ చిన్నపిల్లల బాగోగులు చూసుకోవడంలో తల్లిలాంటి స్థానంలో ఉన్న మీపై ప్రభుత్వం చిన్నచూపు చూడడం తగదన్నారు. రానున్న కాలంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రానుందని, మీ కష్టాలను, సమస్యలను సాధ్యమైనంత వరకు పరిష్కారం చేసేందుకు కృషి చేస్తుందన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరినవారితో అమిలినేని సురేంద్రబాబు

కళ్యాణదుర్గం, మార్చి 2: నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు సమక్షంలో వెంకటాంపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. శనివారం ఆయన క్యాంపు కార్యాలయం వద్ద ఐదు కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి పార్టీ కండువా వేసి అమిలినేని సాదరంగా ఆహ్వానించారు. నాయకులు మంజునాయక్, నరేష్ నాయక్, నగేష్ నాయక్, షరీఫ్, రమేష్ నాయక్ తదితరులు టీడీపీలో చేరారు. వారు మాట్లాడుతూ అమిలినేని కళ్యాణదుర్గం రావడం ఎంతో అదృష్టమని, టీడీపీ విజయానికి కృషి చేద్దామని పిలుపు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముద్దలాపురం గ్రామ వైసీపీ నాయకులు..



పార్టీలో చేరిన వారితో పయ్యావుల శ్రీనివాసులు

కూడేరు, మార్చి 2: మండలంలోని ముద్దలాపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరారు. శనివారం ఆ గ్రామానికి చెందిన ఈడిగ మారుతి, దొమ్మర ఎర్రిస్వామి, గొల్ల లక్ష్మినారాయణ, గొల్ల వెంకటేశులు, దొమ్మర ఆంజనేయులు, మాల తిరుపాల్, ఈడిగ వెంకటస్వామి, దొమ్మర సురేష్, దొమ్మర ఆంజినేయులు, ఈడిగ ఆదినారాయణ తదితరులు వైసీపీని వీడి తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

రాష్ట్రం అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు పయ్యావుల విజయ్ సింహ పేర్కొన్నారు. మండలంలోని కడదరకుంట గ్రామంలో శనివారం ఆయన బాబుష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సైకిల్‌కు ఓటు వేయాలని కోరారు.



గుండ్లపల్లిలో ప్రచారం చేస్తున్న విక్రమ్ సింహ

బెళుగుప్ప: టీడీపీతోనే అభివృద్ధి జరుగుతుందని, సైకిల్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ తనయుడు విక్రమ్ సింహ కోరారు. శనివారం మండలంలోని గుండ్లపల్లిలో టీడీపీ నాయకులతో కలసి బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కరపత్రాలను పంచుతూ విస్తృత ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, మండల నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

మండలంలోని గుండ్లపల్లికి చెందిన వైసీపీ నాయకులు 16 మంది శనివారం యువ నాయకులు విక్రమ్ సింహ సమక్షంలో టీడీపీలో చేరారు. వన్నూరప్ప, సుధాకర్, ఆంజనేయులు, హనుమంతప్ప, ఓబుళేసు, మహాదేవ వెంకటరెడ్డి, లేపాక్షి, కిష్టప్ప, రుద్రయ్య, రమేష్, రామాంజినేయులు, ఆదినారాయణ, హనుమయ్య, చిన్న గంగన్న, ఓబుళేసు చేరినవారిలో ఉన్నారు.

టీడీపీలోకి 40మంది క్రిష్ణాపురం బీసీలు



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు

బొమ్మనహాళ్, మార్చి 2: మండలం క్రిష్ణాపురం గ్రామానికి చెందిన 40 మంది బీసీలు ఉప్పర శ్రీనివాసులు, కావలి ఆంజనేయులు, సంగప్ప, చలపతిల ఆధ్వర్యంలో శనివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రాయదుర్గంలోని కాలవ శ్రీనివాసులు నివాసంలో వారందరికి పసుపు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అన్ని వర్గాల ప్రజల ఆశీర్వాదంతో 50 వేల మెజార్టీ లక్ష్యాన్ని తప్పక అధిగమిస్తామన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా కాలవ వ్యక్తం చేశారు. ముఖ్యంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు తనను ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు. వారి కోసం రానున్న ఐదేళ్ల శ్రమిస్తానని చెప్పారు.

వైభవంగా పల్లకి సేవ

ఉరవకొండ, మార్చి2: మండలంలోని పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం పల్లకి సేవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. స్వామివారిని పట్టువస్త్రాలతో అలంకరించి పల్లకిలో కొలువుదీర్చారు. కార్యక్రమంలో ఈవో విజయ్‌కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలి: ఎమ్మెల్యే



కరపత్రాలు చూపుతున్న మహిళలు

ఉరవకొండ, మార్చి 2: రాష్ట్రంలోని వైసీపీ అరాచకపాలనకు రాబోయే ఎన్నికలలో స్వస్తి పలకాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సూచించారు. మండలంలోని ఆమిద్యాల గ్రామంలో శనివారం ఆయన బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి మహిళలు తీసుకెళ్లారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా రానున్న ఎన్నికల్లో టీడీపీ- జనసేనదే విజయం అన్నారు. జగన్ ప్రభుత్వంలో అన్ని వర్గాలు నష్టపోయారన్నారు. వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోవడంతో పాటు రైతులు అన్ని విధాల నష్టపోయారన్నారు. కార్యక్రమంలో ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, మండల కన్వీనర్ విజయ్‌భాస్కర్, ఏఎంసీ మాజీ చైర్మెన్లు రేగాటి నాగరాజు, బీసీ మారెన్న, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ, టీడీపీ నాయకులు రామకృష్ణ, శ్రీధర్, ఎర్రిస్వామి, రాజశేఖర్, రామాంజనేయులు, ఆనంద్, సూరి, గౌతమ్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

‘టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటాం’



ఆర్థికసాయం అందజేస్తున్న అమిలినేని తనయుడు యశ్వంత్ చౌదరి



సురేంద్రబాబును అభినందిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కళ్యాణదుర్గం, మార్చి 2: టీడీపీ కార్యకర్తలకు అండగా ఉంటూ వారిని అన్ని విధాలా ఆదుకుంటామని కళ్యాణదుర్గం టీడీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు తనయుడు యశ్వంత్ చౌదరి తెలిపారు. శనివారం మండలంలోని బోరంపల్లి, పాలవాయి గ్రామాల్లో ఆయన పర్యటించారు. దీంతో ఆ రెండు గ్రామాల్లో కార్యకర్తలకు రూ.20 వేలు ఆర్థిక సాయాన్ని అందజేశారు. దాంతో పాటు రాయలప్పదొడ్డి, బొమ్మిగానిపల్లి, తీటకల్లు గ్రామ ప్రజలు రహదారిని బాగు చేయాలని కోరగా వెంటనే స్పందించి మరమ్మతు పనులు ప్రారంభించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు అమిలినేని సురేంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే దళితవాడల రూపురేఖలు మార్చుతానని అమిలినేని సురేంద్రబాబు హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయులు కూడా అమిలినేని సురేంద్రబాబును కలిశారు. చంద్రబాబుతో చర్చించి ఉపాధ్యాయ సమస్యలను మేనిఫెస్టోలో చేర్చేందుకు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే శారదాంబ సోదరుడు ఓబుళరాజు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అమిలినేని లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ అనిల్ చౌదరి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గుండె వైద్యశిబిరం

గుంతకల్లు టౌన్, మార్చి 2: పట్టణంలోని కొనకొండ్ల రోడ్డులోని శ్రీవివేకానంద ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరం నిర్వహించారు. రాచేపల్లి బీసీ వన్నప్ప ప్రథమ వర్ధంతి సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముందుగా వన్నప్ప చిత్రపటానికి టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్ పవన్ కుమార్ గౌడ్, టీడీపీ పార్లమెంట్ డాక్టర్ సెల్ అధ్యక్షురాలు పత్తి హిమబిందు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, పురప్రముఖులు పాల్గొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆసుపత్రి వైద్యులు రోగులకు ఉచిత గుండె పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్, కరస్పాండెంట్ ఓంకారప్ప, ప్రిన్సిపాల్, ఆధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన కానిస్టేబుల్ మృతి

గుత్తి రూరల్, మార్చి 2: మండలంలోని జక్కలచెరువు గ్రామ శివారులోని 67వ జాతీయ రహదారిపై గత నెల 24న రోడ్డు ప్రమాదంలో గాయపడిన సీఐఎస్‌ఫ్ కానిస్టేబుల్ మనోహర్ (32) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లి గ్రామానికి చెందిన మనోహర్ తొండపాడులోని రంగనాథ స్వామికి గ్రామం నుంచి నడుచుకుంటూ వస్తుండగా జక్కలచెరువు గ్రామ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన మనోహర్‌ను స్థానికులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. అక్కడ శనివారం తెల్లవారు జామున చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

అనారోగ్యంతో యువకుడు..

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 2: మున్సిపాల్టీ పరిధిలోని కురాకులతోట గ్రామానికి చెందిన చీరల తిమ్మరాజు (28) అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు తిమ్మరాజుకు కొన్ని రోజులుగా దగ్గు, ఆయాసంతో చాలా రోజులుగా బాధపడుతున్నాడన్నారు. ఈ క్రమంలో శనివారం ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు.

ఆరో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

యల్లనూరు, మార్చి 2: చిలమకూరు ఆదర్శ పాఠశాలలో 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సి పాల్ మహేష్ తెలిపారు. ఏదైనా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న 5వ తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఏప్రిల్ 21న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు. ఈనెల 3నుంచి 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జొన్నల కొనుగోలు నిలిపివేత

బొమ్మనహాళ్, మార్చి 2: మండలంలోని జొన్నలు కొనేందుకు సహకార వ్యవసాయ సొసైటీ ద్వారా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. బొల్లనగుడ్డం, సిద్దరాంపురం, దేవగిరి గ్రామాల ఆర్బీకేల ద్వారా జొన్నలను కొనుగోలు చేస్తున్నారు. గత నాలుగురోజులుగా జొన్నలు కొనుగోలుకు సరిపడా బ్యాగులు లేకపోవడంతో నిలిపివేశారని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటివరకు 7010 బ్యాగుల జొన్నలను కొనుగోలు చేశామని ఉద్దేహాళ్ సొసైటీ సీఈఓ హనుమంతు తెలిపారు. సంచులు లేకపోవడంతో కొనుగోలు నిలిపివేశామని సంచులు తిరుపతి నుండి రావాల్సి ఉందని వచ్చిన వెంటనే బుధ, గురువారాల నుంచి కొంటామని సీఈఓ తెలిపారు.

మాజీ కౌన్సిలర్‌కు నివాళి

గుంతకల్లు టౌన్, మార్చి 2: అనారోగ్యంతో మృతి చెందిన పట్టణంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ నాగమణెమ్మకు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ శనివారం నివాళులర్పించారు. నాగమణెమ్మ ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 1987 సంవత్సరంలో పట్టణంలోని 10వ వార్డు కౌన్సిలర్‌గా, 2000సంవత్సరంలో కోఆప్షన్ సభ్యురాలుగా ఆమె పని చేశారు. కార్యక్రమంలో అశోక్, కేవీ నాయుడు, మనేంద్రయాదవ్, మహేష్ రెడ్డి, వాల్మీకి రాము, వాల్మీకి రమణ పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఆర్థిక సాయం

ఉరవకొండ, మార్చి 2: పట్టణంలోని 11వ వార్డుకు చెందిన చేనేత కార్మికురాలు జయలక్ష్మికి టీడీపీ నాయకులు ఆర్థిక సహాయం అంద జేశారు. జయలక్ష్మి మూడురోజుల క్రితం శస్త్రచికిత్స చేయించుకుని ఇంటికి వచ్చారు. ఆర్థిక పరిస్థితి బాగా లేనందున టీడీపీ నాయకులు స్పందించి రూ.5వేలు, సరుకులను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుదర్శన్, రాజేష్, నరసింహులు, టీరే శేఖర్, ప్రభాకర్, ప్రతాప్, నిమ్మలప్రసాద్, శివ పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

పుట్లూరు, మార్చి2: మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు చాలా అధ్వానంగా ఉన్నాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు రామాంజి యాదవ్ పేర్కొన్నారు. తక్కళ్లపల్లి రోడ్డు వద్ద శనివారం వాహనదారులతో కలిసి నిరసన తెలిపారు. రోడ్లపై ఆటోలు, ద్విచక్రవాహనాలు, అంబులెన్స్ ప్రయాణించాలంటే నరకయాతన పడుతున్నారన్నారు. తక్కళ్లపల్లి, గాండ్లపాడు, పుట్లూరు, శనగలగూడూరు, కడవకల్లు, పుట్లూరు- తాడిపత్రి ప్రధాన రోడ్లు అధ్వానంగా ఉన్నాయన్నారు.

రాతిదూలం లాగుడు పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న పూజారి రామాంజనేయులు స్వామి

గుంతకల్లు టౌన్, మార్చి 2: మండలంలోని ఎన్ వెంకటాపల్లి గ్రామం కొండపై వెలసిన పెద్ద కదిరప్ప స్వామి రథోత్సవంలో భాగం గా శనివారం న్యూ కేటగిరి విభాగంలో రాష్ట్ర స్థాయి రాతి దూలం లాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో 10 జతల వృషభాలు పాల్గొన్నాయి. ఈ పోటీలను పూజారి రామాంజనేయులు స్వామి, టీడీపీ నాయకురాలు పత్తిహిమబిందులు ప్రారంభించారు. ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలం గంగన్న పాలేం గ్రామానికి చెందిన ఉమారెడ్డిశ్రీవల్లి వృషభాలు 6000 అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ.40 వేలు, పెద్దపప్పూరు మండలం వరదయ్య పల్లికి చెందిన శ్రీరాములు వృషభాలు 5651 అడుగులు లాగి రెండో బహుమతి కింద రూ. 30వేలు, పల్నాడు జిల్లా నాదెండ్ల మండలానికి చెందిన శ్రీకాంత్‌చౌదరి వృషభాలు 5250 అడుగులు లాగి మూడో బహుమతి రూ. 20 వేలను గెలుపొందాయి.

చికిత్స అందక ఆవు మృతి

కూడేరు, మార్చి 2: ఆవుకు ఆరోగ్యం సరిగాలేదని 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించినా సకాలంలో స్పందించలేదు. దీంతో దాదాపు 60 వేలు విలువ చేసే ఆవు మృతి చెందినట్లు రైతు సుధీర్ తెలిపారు. కడదరకుంట గ్రామానికి చెందిన రైతు సుధీర్ పశుపోషణ చేసుకుని జీవిస్తున్నాడు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఆవుకు కడుపు ఉబ్బిందని 1962 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాడు. వారు ఆలస్యంగా రావడంతో చికిత్స అందక ఆవు మృతి చెందిందన్నారు. సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ఆవు చనిపోయిందని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

యోగాతోనే మానసిక ప్రశాంతత

గుంతకల్లు టౌన్, మార్చి 2: యోగాతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని యోగా గురువు తిప్పయ్య పేర్కొన్నారు. పట్టణంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో శనివారం ఆయుష్ యూనాని ఆసుపత్రి ఆధ్వర్యంలో యోగా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎంఈఓలు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు హాజరై శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో యోగాతో ఒత్తిడి నుంచి ఉపశమనం పొందుతారన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, సాజిద, కాశీనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రమశిక్షణకు నిలయం సరస్వతీ విద్యామందిరం

● అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానందస్వామి



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

పామిడి, మార్చి 2: సరస్వతీ విద్యా మందిరం పాఠశాలలు క్రమశిక్షణకు నిలయాలని అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి కొనియాడారు. పట్టణంలోని సరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాల 48వ వార్షికోత్సవం శనివారం సాయంత్రం ఘనంగా జరిగింది. ఈ వార్షికోత్సవానికి పారిశ్రామిక వేత్త రాంప్రసాద్, జడ్పీటీసీ శోభారాణి, ఆ పాఠశాల ఉన్నత అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, బీవీ రత్నమయ్య, ప్రాథమిక అధ్యక్ష, కార్యదర్శి సునీల్ కుమార్ రెడ్డి, చౌడయ్య, ఉన్నత ప్రధానాచార్యులు శ్రీనివాసన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల విద్యార్థులు సంప్రదాయ నృత్యాలు, విన్యాసాలు, గీతాలాపన, ప్రసంగాలతో అలరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం రైతుల ఖాతాల్లో జమచేయాలి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు, మార్చి2: పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమచేయాలని డిమాండ్ చేస్తూ కిష్టిపాడు గ్రామంలో శనివారం రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటరాముడు, రైతులు మహాత్మాగాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరాముడు మాట్లాడుతూ 2023 రబీ, ఖరీఫ్‌లో పత్తి, వేరుశనగ, మిరప, ఆముదం, కంది, జొన్న, సజ్జ, కొర్ర తదితర పంటలు సాగు చేశారన్నారు. సకాలంలో వర్షాలు లేక పంటలన్నీ ఎండిపోయాయన్నారు. ఎకరాకు రూ.30వేల నుంచి లక్ష రూపాయల మేర పెట్టుబడి పెట్టారన్నారు. ప్రభుత్వం తక్షణమే కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి రంగస్వామి, ఆదినారాయణ, నారాయణస్వామి, అల్లాబకాష్, వెంకటరాముడు, రామాంజనేయులు, కిట్టు, నాగరాజు, నారాయణస్వామి, రంగ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

గుత్తి, మార్చి 2: పట్టణంలోని కోటవీధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులు నిర్వహించిన విద్య, వైజ్ఞానిక ప్రదర్శన ఆకట్టుకుంది. జాతీయ సైన్స్ దినోత్సవంలో భాగంగా విద్య, వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. ఈ ప్రదర్శనలో 3నుంచి 9వ తరగతి విద్యార్థులు చంద్రయాన్-3, ఎస్‌ఎల్‌వీ లాంచింగ్ శాటిలైట్, ఆడ్వాన్స్ స్మార్ట్, అగ్రికల్చలర్ సిస్టమ్‌తో పాటు దాదాపు 200 నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సుభాన్, సైన్స్ ఉపాధ్యాయులు శ్యామిల్‌ప్రతాప్, నాగమ్మ, చంద్రకళ, రఘువీర, పులికొండ, జయరామిరెడ్డి, శేషాద్రి, సరిత, సురేష్, దేశాయినాగరాజు పాల్గొన్నారు.

స్కేటింగ్ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

తాడిపత్రిటౌన్, మార్చి2: స్కేటింగ్ ద్వారా 36గంటల సమయంలో 750 కిలోమీటర్లు ప్రయాణం చేసి ప్రపంచ రికార్డు నెలకొల్పిన విద్యార్థులకు శనివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామ సమీపంలో ఉన్న రమణమహర్షి పాఠశాల విద్యార్థులు ప్రపంచ రికార్డు నెలకొల్పడంతో రోటరీక్లబ్ కార్యాలయంలో వారికి సన్మానం చేశారు. కార్యక్రమంలో మహేష్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సభ్యులు సుబ్రహ్మణ్యం, మద్దిలేటి, బాలసుబ్రహ్మణ్యం, అబ్దుల్‌రహీం పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్తల కుటుంబాలకు ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ధర్మతేజ గౌడ్

పామిడి/ గుంతకల్లుటౌన్, మార్చి 2: మండలంలోని జీ కొట్టాల, రామగిరి గ్రామాలకు చెందిన టీడీపీ యువ కార్యకర్తలు బోయ శివానంద, వడ్డే సురేష్ రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందడంతో ఆ బాధిత కుటుంబాలకు టీడీపీ యువ నాయకులు ధర్మతేజగౌడ్ శనివారం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీ కార్యకర్తలకు తమ కుటుంబం ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. టీడీపీ కార్యకర్తల సమస్యల పట్ల ఎప్పటికప్పుడు స్పందిస్తామన్నారు. ఒక్కో బాధిత కుటుంబానికి రూ. 15వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఆనంద్‌బాబు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి పల్లె శ్రీనివాసులు, నాయకులు మల్లేష్ రెడ్డి, వెంకటేష్, రాజేష్‌నాయక్, సుదర్శన్ బాబు, సుంకిరెడ్డి, మహానంద్, కదిరప్ప, చంద్రశేఖర్, దాసు, సాదిక్‌వలి, నరేష్‌గౌడ్ పాల్గొన్నారు.

పొలాల్లో స్టార్టర్ల చోరీ

రాయదుర్గం రూరల్, మార్చి 2: మండలంలోని ఆవులదట్ల గ్రామంలో గుర్తు తెలియని దుండగులు పొలాల్లోని స్టార్టర్లను దొంగిలించినట్లు రైతులు నరసింహులు, రాజేంద్రప్రసాద్, వెంకటేష్ వాపోయారు. స్టారర్ పెట్టెలు మూడు, తిప్పేస్వామినాయక్ పొలంలో కేబుల్‌వైరును శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు అపహరించినట్లు తెలిపారు. దీంతో దాదాపు రూ. 50 వేలు నష్టపోయినట్లు వారు తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు వాపోయారు.

చలో తిరుపతి పోస్టర్ విడుదల

తాడిపత్రి టౌన్, మార్చి 2: ఏబీవీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో తిరుపతికి సంబంధించిన పోస్టర్‌ను పట్టణంలోని శ్రీరామ్ ఐటీఐ కళాశాలలో శనివారం విడుదల చేశారు. ఏబీవీపీ నాయకులు సాయికార్తీక్, దేవేంద్ర మాట్లాడుతూ విద్యారంగ సమస్యలపై స్టూడెంట్ మేనిఫెస్టో రిలీజ్ చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చలో తిరుపతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

గుత్తి రూరల్, మార్చి 2: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారిపై శనివారం కారు బోల్తాపడి దంపతులకు గాయాలయ్యాయి. అనంతపురానికి చెందిన శివశంకర్, సుస్మిత ఇద్దరు కలిసి డోన్ మండలం కమలపాడుకు కారులో వెళ్తుండగా కొత్తపేట గ్రామ శివారులో అదుపు తప్పి బోల్తాపడింది. స్థానికులు గుర్తించి గాయపడిన వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



గుంతకల్లులో ర్యాలీని ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్



రాకెట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



పామిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది



యాడికిలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



బెళుగుప్పలో ర్యాలీ

పోలియోను నిర్మూలిద్దాం

రెండు చుక్కలతో పోలియోను నిర్మూలిద్దామని పలువురు అధికారులు పిలుపునిచ్చారు. పల్స్‌పోలియో కార్యక్రమం ఆదివారం నిర్వహించనున్న నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించడం కోసం శనివారం పలు ప్రాంతాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ ర్యాలీల్లో పలు పాఠశాలల విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు 0-5 సంవత్సరాలలోపు చిన్నారులకు రెండు చుక్కలు వేయించి పోలియో మహమ్మారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. గుంతకల్లు, తాడిపత్రి, ఉరవకొండ, బొమ్మనహాళ్, కుందుర్పి, యాడికి, పామిడి, బెళుగుప్ప తదితర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



బొమ్మనహాళ్‌లో వైద్య సిబ్బంది ర్యాలీ